# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 139 ఎడిటర్ : మార్పు సాయికుమార్ పేజిలు : 8, వెల రూ. 5, గురువారం - 05 - సెప్టెంబర్ - 2024

Publisher from Srikakulam: circulated at vijayanagaram Visakhapatnam East Godavari West Godavari Krishna gunturu Prakasam Kurnool Nellore Chittoor Kadapa ananthapuram Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఏపీ విపత్తుపై మోదీ ఎందుకు స్పందించరూ : వైఎస్ షర్మిల సూటి ప్రశ్న



- దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు కారణమైన ఏపీ కష్టాలు
- లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అన్నారు.
- బహుమానంగా మోదీ రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు.
- పంట నష్టం కింద రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- బుడమేరు పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు.
- ఇలాంటి విపత్తు మళ్లీ రాకుండా చంద్రబాబు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరావతి : ఏపీలో తలెత్తిన విపత్తుపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు స్పందించడం లేదని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బుధవారం విజయవాడలో వరద ముంపునకు గురైన సింగ్‌నగర్ కాలనీ బాధితులను పరామర్శించారు. అనంతరం ప్రకాశం బ్యారేజీని సందర్శించారు. దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు కారణమైన ఏపీ కష్టాల్లో ఉంటే ఆదుకోరా

## తెలంగాణలో ఐదురోజులు అతిభారీ వర్షాలు..



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వరదలు పోటెత్తాయి.

వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

రాబోయే ఐదురోజుల పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు

తెలంగాణలో వర్షాలు దంచికొడుతున్నాయి.

## అమెరికాను వణికిస్తున్న ట్రిపుల్ వైరస్



వైరస్ సోకిన ఘటనలో ఈ ఏడాది తొలి మరణం నమోదైంది.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దోమల వైరస్ ప్రబలినట్లు అధికారులు ఆందోళన

ఢిల్లీ: అరుదైన దోమల ద్వారా సంక్రమించే వైరస్ తో అమెరికా వణికిపోతోంది. ఈ వైరస్ సోకిన ఘటనలో ఈ ఏడాది

# ఏపీకి ఎవరూ ఇవ్వనంత సాయం ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్

- వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు.
- ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు.
- ఆహారం, తాగు నీరు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.
- తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం




అమరావతి: బాధితులను ఆదుకోవడమంటే మాటలు చెప్పడం కాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరూపించారు. ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయని, ఒక్కో పంచాయతీకి ఒక లక్ష రూపాయల చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తానని ప్రకటించారు. రూ.4 కోట్లు మొత్తాన్ని ముంపు గ్రామ పంచాయతీలకు అందించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం

## తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం : మంత్రి సీతక్క



- 500 ఎకరాల్లో చెట్లు నేలకూలడంపై మంత్రి సీతక్క విస్మయం వ్యక్తం చేశారు.
- 500 ఎకరాల్లో అటవీ సంపద నేల కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు.
- తల్లుల దీవెనతోనే ప్రజలు సురక్షితంగా బయటపడ్డారని వెల్లడించారు.

# హైడ్రాపై కీలక వ్యాఖ్యలు..

## అసహనం వ్యక్తం చేసిన పవన్..




వరదల కారణంగా విజయవాడలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి.

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరుతో చేపట్టిన చర్యలు మంచివేనని

అందుకు హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు.

అమరావతి, సెప్టెంబర్ 04: ఆంధ్రప్రదేశ్‌లో ఎడ తెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు,

# హై అలర్ట్.. ఏపీకి పొంచి ఉన్న మరోముప్పు..




అమరావతి, సెప్టెంబర్ 04: ఇప్పుడిప్పుడే వరద తగ్గిందని ఊపిరి పీల్చుకుంటుండగా.. మరో షాకింగ్ న్యూస్ చెప్పింది వాతావరణ శాఖ. ఒక్కసారిగా వచ్చిపడిన ఉపద్రవం నుంచి ఇంకా తేరుకోకముందే.. పిడుగులాంటి వార్తను ప్రకటించింది ఐఎండీ. మరో ముప్పు పొంచి

- ఏపీకి భారీ వర్షం సూచన ప్రకటించింది వాతావరణ శాఖ.
- దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు
- తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంలో గాలులు వీచే అవకాశం
- విజయవాడ సహా పరిసర ప్రాంతాలన్నీ నీట మునిగిపోయాయి.

## బుడమేరుకు మళ్లీ వరద..

### లోకేష్‌కు చంద్రబాబు కీలక ఆదేశాలు..



వరద ఉధృతి తగ్గడంతోఇరిగేషన్ అధికారులు గండ్లను పూడుస్తున్నారు.

వర్షాలు వల్ల మళ్ళీ బుడమేరుకు వరద ప్రవాహం పెరిగింది.

కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరుకి మూడు చోట్ల గండ్లు పడ్డాయి.

విజయవాడ: అకాల వర్షాలు వల్ల మళ్ళీ బుడమేరుకు వరద ప్రవాహం పెరిగింది. దీంతో బుడమేరుకు గండ్లు పడిన ప్రదేశంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలకు అధికారులు

# ఆగని దందాలు, బ్రేకులు వెయ్యాలని టీడీపీ

మేం అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకకు ఎంత డిమాండ్ ఉండేదో

80 వేల వరకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకకు ఎంత డిమాండ్ ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మేం అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు హామీ ఇచ్చారు.

సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లే ఆంధ్రప్రదేశ్ లో ఉచిత ఇసుక అందిస్తున్నారు.

టన్ను ఇసుకకి ప్రభుత్వానికి రూ. 340 చొప్పున



చెల్లించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పలు ప్రాంతాలలో ఇసుక రీచ్ ల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేసి ఇసుకను విక్రయిస్తున్నారని ఆరోపఫలు ఉన్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలోని వీరనాయపునపల్లె మండలంలోని ఎర్రబల్లె ఇసుక రేవులో అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఇసుక విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం ఒక్కరోజే సుమారు 100 టిప్పర్లు, లారీల్లో ఇసుకను అక్రమంగా కడప, నంద్యాల, గిద్దలూరు, ఓర్వకల్లు, కర్నూలు, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాకు ఇసుక కావాలని టిప్పర్లు,

## రైళ్ల రాకపోకల పునరుద్ధరణ..!!



తెలుగు రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

రద్దు చేసిన రైళ్లను తిరిగి ప్రారంభించనున్నారు.

గుంటూరు నుంచి హైదరాబాద్‌కు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే అధికారులు పంపించారు.

తెలుగు రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల నుంచి

# మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేంద్రమంత్రి ఫైర్



భీమవరం: విపత్తు వేళ హుందాగా వ్యవహరించకుండా ప్రభుత్వంపై నిందలు వేస్తున్న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రం ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో జగన్ రాజకీయాలు మాట్లాడటం సబబు కాదని హితబోధ చేశారు. ఈ మేరకు ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ తీవ్రంగా వైఫల్యం చెందాడు కాబట్టే ఏపీ జనాలు

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రం ఉక్కు,
- రాష్ట్రంలో విపత్తును ఎదుర్కొనేందుకు కేంద్రం అండగా ఉంటుందని ఆయన భరోసా
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో జగన్ రాజకీయాలు మాట్లాడటం సబబు కాదని హితబోధ
- జగన్ తీవ్రంగా వైఫల్యం చెందాడు కాబట్టే ఏపీ జనాలు 11 సీట్లతో సరిపెట్టారని చురకలు అంటించారు.

## ఆగని దందాలు, బ్రేకులు వెయ్యాలని టీడీపీ

మొదటి పేజి తరువాయి

లారీలు, ట్రాక్టర్లు తీసుకొని ఇసుక రీచ్ ల దగ్గరికి వెళ్ళామని, అయితే మమ్మల్ని కాదని దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఒక్కొక్క ట్రక్కుకు 20 టన్నుల ఇసుక ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 20 టన్నుల ఇసుకకి రూ. 8, 000 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా అదనంగా రూ. 4000 వసూలు చేస్తున్నారని, ఇసుక రీచ్ దగ్గర స్లిప్పులు ఇచ్చే వ్యక్తి అదనంగా మరో రూ. 500 వసూలు చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు ఇలా ఇక్కడ తీసుకున్న ఇసుకను కర్నూలు, నంద్యాల, ఓర్వకల్లు, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో ట్రక్కు ఇసుక రూ. 80 వేల వరకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. బుధవారం కూడా ఇసుక రీచ్ ల దగ్గర స్థానికులకు బయట నుండి వచ్చిన వాళ్ళకి ఇసుక తీసుకునే విషయంలో వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో సచివాలయంలో స్లిప్పులు ఇస్తామని, స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామని, ఇసుక కోసం వచ్చిన అందరికి ఇసుక ఇస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది వైసీపీ నాయకులు అక్రమంగా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని మంగళవారం మాత్రమే సుమారు 100 టిప్పర్లలో ఇసుకను తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన స్థానిక టీడీపీ నాయకులు చంద్రబాబు ప్రభుత్వానికి ఫిర్యాదు చెయ్యడానికి సిద్ధం అయ్యారు.

## అమెరికాను వణికిస్తున్న ట్రిపుల్ వైరస్

మొదటి పేజి తరువాయి

తొలి మరణం నమోదైంది. ఈస్టర్న్ ఈక్విన్ ఎన్సెఫలైటిస్ (ఈఈఈ)గా పేర్కొంటున్న ఈ వైరస్ బారిన పడిన ఒక వ్యక్తి న్యూ హాంపైర్లో చనిపోయినట్లు అక్కడి అధికారులు ప్రకటించారు. ఈ రాష్ట్రంలో దశాబ్దకాలంలో జరిగిన తొలి వైరస్ మరణం అని, అమెరికాలో ఈ ఏడాది గుర్తించిన ఐదో కేసు అని అధికారులు పేర్కొన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే ఈ వైరస్కు అడ్డుకట్ట వేసేందుకు అమెరికా ఆరోగ్య శాఖ అధికారులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. న్యూ హాంప్ షైర్ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దోమల వైరస్ ప్రబలినట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రమైన మసాచుసెట్స్ లోని పలు ప్రాంతాలు ఈ వైరస్ కారణంగా హైఅలర్ట్లో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ ట్రిపుల్ ఈ వైరస్ అరుదైనది కానీ తీవ్రమైనదిగా అధికారులు చెప్తున్నారు. అరుదైన దోమల ద్వారా సంక్రమించే వైరస్ తో అమెరికా వణికిపోతోంది. ఈ వైరస్ సోకిన ఘటనలో ఈ ఏడాది తొలి మరణం నమోదైంది. ఈస్టర్న్ ఈక్విన్ ఎన్సెఫలైటిస్ (ఈఈఈ)గా పేర్కొంటున్న ఈ వైరస్ బారిన పడిన ఒక వ్యక్తి న్యూ హాంపైర్లో చనిపోయినట్లు అక్కడి అధికారులు ప్రకటించారు.

## తెలంగాణలో ఐదురోజులు అతిభారీ వర్షాలు..

మొదటి పేజి తరువాయి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వరదలు పోటెత్తాయి. చెరువులు జలకళను సంతరించుకోగా.. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు సంభవించిన వరదలతో ఖమ్మం సహా పలుచోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా వర్షాలపై వాతావరణశాఖ మరో కీలక అప్డేట్ను అందించింది. రాబోయే ఐదురోజుల పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. యానం, ఉత్తరాంధ్ర పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం సముద్రమట్టానికి సగటున 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉందని.. ఎత్తుకువెళ్లే కొలది నైరుతి దిశలో వంగి ఉందని పేర్కొంది. గురువారం వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో రాగల ఐదురోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని.. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ను జారీ చేసింది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్,జ్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గురువారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతాయని చెప్పింది. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, మంచిర్యాల, సిద్దిపేట, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో కొహెడలో 22.3, సముద్రాల గ్రామంలో 21 సెంటీమీటర్ల భారీ వర్షాపాతం రికార్డయ్యిందని టీజీడీపీఎస్ వివరించింది.

## ఏపీ విపత్తుపై మోదీ ఎందుకు స్పందించరూ : వైఎస్ షర్మిల సూటి ప్రశ్న

మొదటి పేజి తరువాయి

అని నిలదీశారు. సుమారు 5 లక్షల మంది వరద ప్రభావానికి లోనయ్యారని, లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అన్నారు. ఘోర విపత్తు జరిగితే ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఏపీ నుంచి 25 మంది ఎంపీలు కేంద్రానికి మద్దతు తెలుపుతుంటే ఏపీ ప్రజల ఇబ్బందులు ఎందుకు కనిపించడం లేదో తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల నుంచి ఏపీ ఎంపీలు బీజేపీ పార్టీకి బానిసలుగా భుజాన ఎత్తుకుని తిరుగుతున్నారని, అందుకు బహుమానంగా మోదీ రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ప్రతి అంశాల్లోనూ చిన్నచూపు చూస్తున్నారని, ఏపీ విపత్తున జాతీయ విపత్తుగా ప్రకటించాలని, వర్షంతో నష్టపోయిన బాధితులకు ఒక్కొక్కరికీ రూ. లక్షా, ప్రాణాలు కోల్పోయిన వారికి రూ. 5లక్షలు ఇవ్వాలని, పంట నష్టం కింద రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి విపత్తు మళ్లీ రాకుండా చంద్రబాబు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, వైఎస్ జగన్ బుడమేరును పట్టించుకోక పోవడం వల్లే విజయవాడ ముంపునకు గురయిందని ఆరోపించారు.

## తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం : మంత్రి సీతక్క

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : ములుగు అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకూలడంపై మంత్రి సీతక్క విస్మయం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే చెట్లు నెలకొరిగిన ప్రాంతాన్ని సందర్శించినప్పటికి ఈ స్థాయిలో లక్ష చెట్ల వరకు కూలిపోయాయని ఊహించలేదన్నారు. జరిగిన నష్టాన్ని డ్రోన్ కెమెరాల సహాయంతో అంచనా వేసే క్రమంలో జరిగిన విధ్వంసం బయటపడిందన్నారు. ఘటనపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓ, స్థానిక అధికారులతో మంత్రి టెలిఫోన్లో మాట్లాడారు. 500 ఎకరాల్లో అటవీ సంపద నేల కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో భారీ వృక్షాలు నేల కూలడంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఘటన ప్రాంతాన్ని సందర్శించి పీసీసీఎఫ్ నివేదిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అడవిలో సుడిగాలి రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమన్నారు. ఈ సుడిగాలి గ్రామాల్లో సంభవించి ఉంటే పెను విధ్వంసం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమక్క, సారలమ్మ తల్లుల దయ వల్లే సుడిగాలి ఊర్ల మీదకు మల్లలేదన్నారు. తల్లుల దీవెనతోనే ప్రజలు సురక్షితంగా బయటపడ్డారని వెల్లడించారు. చెట్లు నెలకూలడంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలను పంపి పరిశోధన జరిపించి కారణాలు గుర్తించేలా కేంద్ర మంత్రులు చొరవ చూపాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లు కూలిన చోట తిరిగి చెట్లు పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాకి విజ్ఞప్తి చేశారు.

## ఏపీకి ఎవరూ ఇవ్వనంత సాయం ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్

మొదటి పేజి తరువాయి



అందించ నున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యా లయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు, గ్రామాలలో తాగు నీరు, ఆహారం సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ఏలేరు ముంపు ప్రభావిత గ్రామాలను అప్రమత్తం చేయాలి: పవన్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం నేపథ్యంలో ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, ఆహారం, తాగు నీరు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఆయన జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. ఏలేరుకి వచ్చిన వరద నీరు, ఈ రోజు సాయంత్రం నుంచి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితులపై కలెక్టర్ వివరించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకి ఏలేరు రిజర్వాయర్కి 20.2 టీఎంసీల నీరు చేరుకుందని, క్రమంగా నీరు వదలాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇవాళ (బుధవారం) 500 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతామని, పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాల వైపు నీరు మళ్లుందని చెప్పారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగు నీరు, ఔషధాలు సిద్ధం చేసే విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# రైళ్ల రాకపోకల పునరుద్దరణ..!!

మొదటి పేజి తరువాయి

భారీ వర్షాల కారణంగా వరంగల్ జల్లాలోని మహబూబాబాద్ వద్ద గల ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరుద్దరణ పనులు పూర్తి చేసారు. ఇప్పటికే ట్రయిల్ రన్ జరిగింది. ఈ సాయంత్రం నుంచి తిరిగి ఈ మార్గంలో రైళ్లను పునరుద్దరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు రద్దు చేసిన రైళ్లను తిరిగి ప్రారంభించనున్నారు.

ట్రాక్ పనులు పూర్తి

విజయవాడ–హైదరాబాద్ మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్కు మరమ్మతులు పూర్తయ్యాయి. తొలుత గుంటూరు నుంచి హైదరాబాద్కు గోల్కొండ ఎక్స్ప్రెస్ను రైల్వే అధికారులు పంపించారు. మిగిలిన రైళ్లను సాయంత్రం లోపు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్ప్రెస్ సాయంత్రం బయల్దేరనుంది.



రైళ్ల పునరుద్దరణ

ఇంటికన్నె–కేసముద్రం మధ్య రైల్వేట్రాక్ పునరుద్దరణ పనులు పూర్తి అయినట్లు అధికారులు నిర్ధారించారు. అప్లైన్ మార్గంలో రైల్వేట్రాక్ పునరుద్దరణ పనులు పూర్తి అయ్యాయి. డౌన్లైన్లో అర్ధరాత్రి కల్లా పనులు పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

వరదల వల్ల మహబూబాబాద్ జిల్లాలో ధ్వంసమైన రైల్వేట్రాక్ ను 52 గంటల్లో అధికారులు పునరుద్దరించారు. ఈ ట్రాక్ రిపేర్ కారణంగా వరంగల్ – విజయవాడ ల మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ట్రాక్ ను పునరుద్ధరించడంతో నేటి నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభం కానున్నాయి.

రాకపోకలు మొదలు

వరంగల్ మీదుగా ఢిల్లీకి రైళ్ల రాకపోకలు సాగనున్నాయి. అయితే కొత్త ట్రాక్ కనుక ఈ ట్రాక్ పై రైళ్లు నెమ్మదిగా వెళ్లాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సూచించారు. ఈ ట్రాక్ పైన మరమ్మత్తుల కారణంగా ఉత్తరాది నుంచి దక్షిణాదికి వచ్చే పలు రైళ్లను దారి మళ్లించారు. విజయవాడ – గుంటూరు మీదుగా రైళ్లను కొనసాగించారు. పలు ఎక్స్ ప్రెస్ రైళ్లను రద్దు చేసారు. అయిదు రోజులుగా పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపుతో ఇబ్బందులు పడిన ప్రయాణీకులకు తిరిగి ఈ లైన్ లో రాకపోకలకు లైన్ క్లియర్ కావటంతో యధావిధంగా రైళ్లు కొనసాగనున్నాయి.

# హై అలర్ట్.. ఏపీకి పొంచి ఉన్న మరోముప్పు..

మొదటి పేజి తరువాయి

అమరావతి, సెప్టెంబర్ 04: ఇప్పుడిప్పుడే వరద తగ్గిందని ఊపిరి పీల్చుకుంటుండగా.. మరో షాకింగ్ న్యూస్ చెప్పింది వాతావరణ శాఖ. ఒక్కసారిగా వచ్చిపడిన ఉపద్రవం నుంచి ఇంకా తేరుకోకముందే.. పిడుగులాంటి వార్తను ప్రకటించింది ఐఎండీ. మరో ముప్పు పొంచి ఉందంటూ అలర్ట్ చేసింది. అవును.. ఏపీకి భారీ వర్షం సూచన ప్రకటించింది వాతావరణ శాఖ. ఉత్తరాంధ్రను, పశ్చిమ బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతం అనుకొని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నాటికి అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు.

ఆ జిల్లాలకు అలర్ట్..

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా.. పల్నాడు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు




ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి భారీ ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రజలను అలర్ట్ చేశారు. తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంలో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

జనజీవనం అస్తవ్యస్తం..

రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆంధ్రప్రదేశ్ అతలాకుతలం అయ్యింది. బుడమేరు, మున్నేరు వరదతో కృష్ణమ్మ జల ప్రళయం సృష్టించింది. విజయవాడ సహా పరిసర ప్రాంతాలన్నీ నీట మునిగిపోయాయి. ఇళ్లన్నీ నీట మునిగిపోవడంతో ప్రజలు నిరాశ్రయులయ్యారు. కనీసం తినడానికి తిండి లేక నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికీ పలు ప్రాంతాలు వరదలోనే ఉన్నాయి. అయితే, వరద ఉధృతి తగ్గడం, వాన లేకపోవడంతో హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే వాతావరణ శాఖ మరోసారి హై అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇక గడిచిన 24 గంటలలో రాష్ట్రంలో పలు జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కైకలూరులో 6 సెంటిమిటర్ల వర్షపాతం నమోదైంది. విజయవాడలో 4 సెంటిమిటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా చోట్ల చదరుమదరు వర్షం కురిసింది.

# పారిపోయిన వైసీపీ మాజీ ఎంపీ..?

అమరావతి, సెప్టెంబర్ 04: పోలీసులు అరెస్ట్ చేస్తారని భయపడ్డారా? కోర్టు తీర్పు రావడమే ఆలస్యం.. అబ్స్కాండ్ అయ్యారా? అరెస్ట్ భయంతో స్టేట్ దాటి వెళ్లారా? అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగాం సురేష్ కూడా నిందితుడు. ఈ కేసులో తనన అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారాయన. అయితే, హైకోర్టు బెయిల్ ఇచ్చేది లేదని.. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది.

జాడ దొరకని సురేష్..

హైకోర్టు తీర్పు నేపథ్యంలో మాజీ ఎంపీ నందిగాం సురేష్ను అరెస్ట్ చేసేందుకు ఆయన ఇంటికి వెళ్లారు పోలీసులు. ఆయన ఇంట్లో లేరని అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లిపోయారు. హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేయడంతో సురేష్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు వస్తారని ముందస్తు సమాచారం అందుకుని.. ఇంటి నుంచి పారిపోయారని తెలుస్తోంది. పోలీసుల




అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు నందిగం సురేష్ స్టేట్ దాటిపోయే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరి హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి పోలీసులకు లొంగిపోతారా? లేక పోలీసుల భయపడి అజ్ఞాతంలోనే ఉంటారా? అనేది వేచి చూడాలి.

వైసీపీ నేతలకు షాక్ ఇచ్చిన హైకోర్టు..

కాగా, మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్, అప్పిరెడ్డి, నందిగాం సురేష్, తలశిల రఘురామ్ సహా మరో 14 మంది నిందితులుగా ఉన్నారు. వీరంతా తమను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని, అరెస్ట్ నుంచి రక్షించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ను విచారించిన ధర్మాసనం.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించే ప్రసక్తే లేదని ఏపీ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

## బుడమేరుకు మళ్లీ వరద.. లోకేష్‌కు చంద్రబాబు కీలక ఆదేశాలు..

మొదటి పేజి తరువాయి

కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరుకి మూడు చోట్ల గండ్లు పడ్డాయి. 200 మీటర్ల మేర గండ్లు పడడంతో కవులూరు, ఈలప్రోలు రాయనపాడు, సింగినగర్ మీద బుడమేరు విరుచుకుపడింది. వరద ఉధృతి తగ్గడంతోఇరిగేషన్ అధికారులు గండ్లను పూడుస్తున్నారు. గండ్లు పడడానికి ప్రధాన కారణం గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ మట్టి తవ్వకాలేనని రైతులు అంటున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.మరోవైపు బుడమేరుకు పడిన గండ్లు పూడ్చివేత కార్యక్రమాలను పర్యవేక్షించాల్సిందిగా మంత్రి లోకేష్ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుడమేరు కుడి, ఎడమ ప్రాంతాల్లో పడిన గండ్లు గురించి నారా లోకేష్.. అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా గండ్లు పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గండ్లు పూడ్చివేత పనులను పర్యవేక్షించడానికి బుడమేరు వద్దకు లోకేష్ బయలుదేరి వెళ్లారు. మంత్రి లోకేష్ పర్యవేక్షణలో విజయవాడలో సహాయ చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఈ రోజు వరద బాధితులకు ఉదయమే ఇళ్లకు వెళ్లి 1200 మంది టీడీపీ కార్యకర్తలు టిఫిన్, పాలు అందజేశారు. వరద ప్రభావానికి గురైన 36 వార్డుల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయిత

## హైడ్రాపై కీలక వ్యాఖ్యలు.. అసహనం వ్యక్తం చేసిన పవన్..

మొదటి పేజి తరువాయి



వరదల కారణంగా విజయవాడలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. దీంతో లక్షలాది మంది నగర జీవులు నిరాశ్ర యులయ్యారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం అమరావతిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరుతో చేపట్టిన చర్యలు మంచివేనని తెలిపారు. భవనాలు నిర్మించిన అనంతరం కూల గొట్టడం ద్వారా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం నిర్మాణాలు ఉండేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. బుడమేరు వాగును శాటిలైట్ ద్వారా పరిశీలించి.. అవసరమైన చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. అందుకు హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. అయితే ఇదే అన్నింటికి పరిష్కారం కాదన్నారు. అదే సమయంలో పేదలను సైతం దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనం నిబంధనలు విధించి.. వాటిని పటిష్ఠంగా అమలు చేయాల్సిన బాధ్యత సైతం మనపై ఉందన్న విషయాన్ని విస్మరించరాదని పేర్కొన్నారు. ఆ క్రమంలో నదులు, చెరువులు, కాలువలు ఆక్రమణకు గురి కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేంద్రమంత్రి ఫైర్

మొదటి పేజి తరువాయి

11 సీట్లతో సరిపెట్టారని చురకలు అంటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ పూర్తి సమయం వరద ప్రాంతాల్లో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీపిస్తూనే ఉన్నారని ప్రస్తావించారు. విపత్తు సమయంలో ప్రజలకు సహాయం అందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పని చేయాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల ముసుగులో వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని, రాష్ట్రంలో విపత్తును ఎదుర్కొనేందుకు కేంద్రం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక సభ్యత్వం నమోదు కోసం కృషి చేస్తామని మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.

అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి: టీజీ వెంకటేశ్

విజయవాడ నగరం వరదలతో అతలాకుతలమవుతోందని, దీని నుంచి ప్రజలను రక్షించడానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంటకేశ్ అన్నారు. వరద ముంపు ప్రాంతంలో ఎటువంటి విష జ్వరాలు, అంటు రోగాలు రాకుండా సత్వర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని, గతంలో వరద ప్రాంతాల్లో పనిచేసిన అధికారులను వారి అనుభవాలను సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి పారిశుధ్య కార్మికులను ముంపు ప్రాంతాలకు తరలించి పారిశుధ్య లోపం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో వరదలు సంభవించినప్పుడు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. కర్నూలు జిల్లాలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. సభ్యత నమోదు కార్యక్రమం ప్రతి పార్టీలో ముఖ్యమైన ఘట్టమని అన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు అని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా కింది స్థాయిలో కూడా నాయకులు చేయబోయే మంచి పనులు కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## వరద బాధితులకు ఏపీ ఎన్జీవో రూ. 120 కోట్ల భారీ విరాళం



అమరావతి : ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు భారీ విరాళాన్ని ప్రకటించారు. ఉద్యోగుల సెప్టెంబర్ నెల జీతంలో ఒక రోజు బేసిక్ పే ద్వారా రూ. 120 కోట్లు సీఎం సహాయనిధికి విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు , ఉపాధ్యాయులు పింఛన్ల నుంచి ఈ విరాళం అందజేస్తామని జేఏసీ నాయకులు కె.వి.శివారెడ్డి, విద్యాసాగర్ సీఎం చంద్రబాబుకు అంగీకార పత్రం అందజేశారు. వరద బాధితుల కోసం ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. 25 లక్షలు అందజేసింది. ఉమ్మడి తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ భారీ విరాళాన్ని ప్రకటించారు. సుమారు రూ. 6 కోట్లను ప్రకటించారు. ఏపీలోని 400 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తనవంతుగా లక్ష రూపాయల చొప్పున రూ. 4 కోట్లు అందజేస్తానని ప్రకటించారు. ఏపీకి, తెలంగాణకు రూ. కోటి చొప్పున సీఎం సహాయనిధికి పంపిస్తానని తెలిపారు. హెరిటేజ్ ఫుడ్ అధినేత నారా భువనేశ్వరి రెండు తెలుగు రాష్ట్రాలకు రూ. కోటి చొప్పున ప్రకటించారు.

# కోడిపందాలపై పోలీసులు దాడి...



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నరేంద్ర పట్నం మామగాడ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై జగ్గంపేట పోలీసులు దాడులు నిర్వహించారు. మామిడాడ ,నరేంద్ర పట్నం గ్రామాల మధ్యలో ఉన్న అటవీ ప్రాంతంలో కోడిపందాలను నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావుకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఎస్సై తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందాలు ఆడుతున్న పదిమంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 78 వేల రూపాయలు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసామని, కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని
## మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా



అమరచింత వనపర్తి జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని 4,5 వ, వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం సిపిఐ నాయకులు కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఐ మండల పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్ లు మాట్లాడుతూ, ఈ రెండు వార్డుల్లో పాత ఐరన్ పోల్స్ ను తొలగించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు కోల్పోయిన బాధితులకు వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెండు దళిత కాలనీల పై మున్సిపల్ అధికారులు వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. ఐదో వార్డులో 1984లో నిర్మించిన హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇండ్లు శిథిలావస్థకు చేరాయని వాటి మరమ్మతుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతున్నామని అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వెంటనే డ్రైనేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అమరచింత మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సిపిఐ ఆందోళన చేపడుతుందని అన్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కాని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మేనేజర్ యూసుఫ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రవీందర్ శ్యాంసుందర్ కుతుబ్ ఇబ్రాయిల్ తోపాటు నాలుగు, ఐదు వార్డుల కాలనీవాసులు పాల్గొన్నారు.

## వరదలు వస్తే ప్రజల్ని
## అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలి

- శ్రీరామగిరి సర్పంచ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్



వి.ఆర్.పురం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాల వలన మరల వరదలు వచ్చే అవకాశం ఉన్నందున వరదల్లో ముంపు గురయ్యే గ్రామాల ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాల లో ఉంచి వారందరికీ అన్ని సౌకర్యాలు కల్పించాలని శ్రీరామగిరి సర్పంచ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వరదలకు నీట మునిగిన వారికి మునగని వారికి అందరికీ సమంగా 3000 రూపాయలు ఇచ్చారని, సుమారు పది రోజులపాటు ఇల్లన్నీ నీట మునిగి గుట్టలెక్కి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నటువంటి వరద బాధితులకు తీరని అన్యాయం జరిగిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికీ పూర్తిగా ఇల్లు కూలిపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదని నీట మునిగిన శ్రీరామగిరి గ్రామపంచాయతీ ప్రజలకు పరదాలు కూడా అందించలేదని ఈ వరదల్లో అయినా పరదాలు తప్పనిసరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వరద బాధితుల తో పాటుగా ఇబ్బందులను ఎదుర్కొన్నటువంటి ఉద్యోగస్తులు కూడా వరద సహాయం ఇవ్వాలని గతంలో 3000 రూపాయలు ఆర్థిక సాయం వారికి అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరద పెరుగుతుందని అధికారులు ప్రకటనలు చేస్తున్నారని, ఎక్కడైతే రోడ్ బ్లాక్ అవుతుందో అక్కడ పడవలు ఏర్పాటు చేసి నిత్యవసరాలు కిరోసిన్ వరద బాధితులకు అందించాలని ఆయన కోరారు.

## 34 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్న
## జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఉచిత టెట్‌డీఎస్సీ కోచింగ్



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 580 మందికి ఉచిత టెట్ం డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారి సతీమణి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి సారథ్యంలో కోచింగ్ తీసుకుంటున్న వారందరికీ సకల ఏర్పాట్లు చేసి భోజనం ,టీ అందిస్తూ మంచి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కోచింగ్ అందిస్తున్నారు 33 రోజులుగా ఈ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ ఇంకా నెలరోజులపాటు ఈ కోచింగ్ సెంటర్ కొనసాగుతుందని జగ్గంపేట నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమం తీసుకున్నామని చైర్మన్ జ్యోతుల మణి తెలియజేశారు.

## సామాజిక అంశాలపై మహిళలు శ్రద్ధ చూపాలి



ఆమదాలవలస.. సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మహిళా సంఘాలు కేవలం ఆర్థిక అంశాలకే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏ.పి.ఎం. పైడి కూర్మారావు మహిళలకు సూచించారు. మంగళవారం రామచంద్రాపురం పంచాయతీలో గల పొన్నాంపేట లో గాలాల హేమలత అధ్యక్షతన జరిగిన గ్రామ సంఘం నెలవారీ షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న పాలకవర్గ సమావేశమునకు హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలు సమావేశాల నిర్వహణ, పొదుపులు చేయడం, అవసరం మేరకు అప్పు తీసుకొని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, పారదర్శకంగా పుస్తక నిర్వహణ తో పాటు సామాజిక అంశాలపై ఎక్కువగా శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుధ్యం, మంచినీరు, మురుగునీటి కాలువల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపయోగం, వన సంరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించడం, ప్రకృతి వ్యవసాయం, పేరటి తోటల అభివృద్ధి ,ఔషధ మొక్కల పెంపకం, ఆరోగ్యం, ఆడపిల్లల విద్య, పౌష్టికాహారం, జండర్ తదితర అందరికీ ఉపయోగపడే అన్ని అంశాల మీద సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ఆచరించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం లీడర్లు కె.మీణ, జి. భవాని, తో పాటు వి.వో.ఏ. గాయత్రి, క్లస్టర్ కోఆర్డినేటర్ రామప్పడు, మహిళా రైతు సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

# మళ్లీ వరదలు.. "ఈ బాధలు పడలేము"

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వండి ఇక్కడ నుండి వెళ్ళిపోతాం
- ఏడాదికి రెండు, మూడు సార్లు వరదలు వేస్తే బ్రతికేది ఎలా?
- అందరికీ పునరావాస ప్యాకేజీ ఇస్తే ఇక్కడి నుండి వెళ్తాం కదా?
- బెజవాడ తరహా వరదలు ఇక్కడ నిత్య కృత్యం గా మారాయా?
- సర్వేలు పేరుతో అధికారులు ఇంకెంతకాలం సాగదీస్తారు .
- వరద వలన పిల్లల చదువులు అటకెక్కయి!!
- సరైన పని దొరక్క గ్రామాలు జీవితాలు అగమ్య గోచరంగా తయారయ్యాయి
- వరదలొస్తే హడావుడి చేయడమే తప్ప సరైన సర్వే చేసి పంపేది ఎప్పుడు?





వి.ఆర్.పురం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఏడాదికి రెండు మూడు సార్లు గోదావరి శబరి వరదలతోటే విలీన మండలాల వాసుల బ్రతుకులు తెల్లవారు పోతున్నాయి. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు అని ప్రాజెక్టు నిర్మిస్తే హరితాంధ్రప్రదేశ్ గా వర్ధిల్లుతుందని నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్ట్ నిర్మాణం సజావుగా జరుగుతున్న నిర్మాణ వ్యయం పెరుగుతున్న, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం పైనే దృష్టి పెడుతున్నాయి తప్పితే నిర్వాసితుల కోసం గోరంతైన ఆలోచించేది లేదని గుండెలు పగిలేలా మండలాల్లో నిర్వాసిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క వరద బీభత్సానికే బెజవాడ అతలాకుతలం అయిందని సినీ ప్రముఖులు రాజకీయవేత్తలు సీఎం రిలీఫ్ ఫండ్కు కోట్ల రూపాయలు విరాళం ఇస్తున్నారు. అదేవిధంగా ఏడాదికి రెండు, మూడు సార్లు వరదలు వచ్చే పోలవరం నిర్వాసిత గ్రామాల వైపు ఎందుకు కన్నెత్తైనా చూడట్లేదని నిర్వాసితులు వాపోతున్నారు. ఒక వరదతోనే బ్రతుకు భయంకరంగా తయారయింది అలాంటిది. ఏడాదికి రెండు మూడు సార్లు వరద వేస్తే బ్రతికేది ఎలా?. ఇకపై ఈ వరద బాధలు పడలేమని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగతిన అందిస్తే ఇక్కడనుండి వెళ్ళిపోతామని నిర్వాసితుల వాదన. కాంటూర్ పరిధిలో ఏర్పాటుచేసి కొందరికి మాత్రమే పునరావాస ప్యాకేజీ ఇస్తే మరికొందరు పరిస్థితి ఏమిటని నిత్య కృత్యంగా వచ్చే గోదావరి వరదలకు ఇక్కడే జల సమాధి కావలసిందేనా అని ప్రశ్నిస్తున్నారు. కాంటూర్ పరిధిలో కాకుండా అందరికీ పునరావాస ప్యాకేజీ ఇస్తే ఇక్కడి నుండి వెళ్తాం కథ అని అంటున్నారు. అకాల వర్షాలు వరదలు చూస్తే బెజవాడ తరహా వరదలు ఇక్కడ నిత్య కృత్యం గా మారాయా? ఏంటని ఆందోళన చెందుతున్నారు. హేళ్ల తరబడి సర్వేలు పేరుతో ఇంకెంతకాలం సాగదీస్తాన్నారు ఇక్కడి అధికారులు. నిర్వాసితులకు గగ్గులు పెట్టిన ప్రతిసారి తూతూ మంత్రంగా సర్వేలు జరిపి నామమాత్రంగా గ్రామానికి సగానికి ఆర్ అండ్ ఆర్ లో పేర్లు వచ్చేలా మిగిలిన వారిని గాలికి వదిలేసేలా ఇక్కడ సర్వేలు జరుగుతున్నాయని గ్రామాల్లో ఇప్పటికి పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీ ఇవ్వలేదని ఎక్కడ చూసినా కొరతగాని కొన్ని కుటుంబాలు మిగిలి ఉన్నాయి అని రోదిస్తున్నారు సాధారణ సెలవులతో పోల్చుకుంటే వరద ప్రభావిత మండలాల్లో ప్రత్యేక వరద సెలవలతో ఇక్కడ నివసిస్తున్న కుటుంబాల్లోని పిల్లల చదువులు అటకెక్కయని ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. సర్వేలు పూర్తి అవ్వలేదని ఇంకా కొన్ని గ్రామాలు 45 కాంటూరు పరిధిలో ఉన్నాయని ఆ 45 కాంటూరు సర్వేలో ఇల్లు పూర్తయ్య వరకు ఇక్కడే ఉంటే ఈ వరదల కారణంగా సరైన పని దొరక్క పంపు గ్రామాల్లోని జీవితాలు అగమ్య గోచరంగా తయారయ్యా పరిస్థితి నెలకొందని ముంపు గ్రామస్తులు ఆందోళనకు చెందుతున్నారు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే మండలాలకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి హడావుడి చేయమే తప్ప సరైన సర్వే చేసి పంపేది ఎప్పుడు అని ముంపు గ్రామస్తులు నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికీ మండలంలోని బీసీ కాలనీకి చెందిన సుమారు 150 కుటుంబాలు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు పేర్లు రాకపోవడంపై గతంలో అనేక ఆందోళనను చేపట్టిన ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి మండలంలోని బుడ్డిగూడెం గ్రామానికి చెందిన పంచాయతీ పరిధిలో విఆర్ పురం బీసీ కాలనీ ఇంటి పన్ను కట్టించుకున్నప్పటికీ ఇంటి పరిధిలోని సంబంధిత భూమి రేకపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుందని అధికారులు చెప్పడంతో ఇప్పటికీ పునరావాస ప్యాకేజీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు ఎలాంటివి సమస్యలు జిల్లా అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లిన ఫలితం శూన్యం ప్రాజెక్టు పెడితే ఎవరు బ్రతుకులు బాగుపడతాయో దేవుడు ఎరుగునని ప్రస్తుతానికి నిత్య కృత్యంగా మారిన వరదల వలన విలీన గ్రామాల్లోని నివసిస్తున్న కుటుంబాల్లో ఎప్పటికీ తీరని శోకంగా మిగిలి ఇక్కడే జల సమాధి అయ్యేవరకు ప్రభాస ప్యాకేజీ అందుతుందో లేదో తెలియని ఆందోళనగా మిగిలిపోతుందని నిర్వాసితులు వాపోతున్నారు.

మళ్ళీ పెరుగుతున్న వరద

దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు ,వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో జీవనది గోదావరి, శబరి కు భారీగా వరద ఉధృతి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లో భాగంగా బాక్ వాటర్ ప్రభావంతో ముంపు మండల అయిన వి.ఆర్.పురం, కూనవరం,చింతూరు,ఏటపాక, కుకునూరు, వేరుపాడు మండలాల్లోని గ్రామాలు అధికంగా నితముగుతున్నాయి. భద్రాచలం లో మొదటి ప్రమాద హెచ్చరిక కు దగ్గరగా సుమారు 43 అడుగులు నీటిమట్టం పెరిగింది. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. ఇప్పటికే రెండు సార్లు వరదతో ఇబ్బంది పడ్డారు. మళ్ళీ వరద పెరగడం తో ఆందోళన చెందుతున్నారు.

## జనసేన గ్రామ ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు
## ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



జీలుగుమిల్లి సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం గ్రామం లో కేక్ కటి చేసి మిటాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శేయస్సు కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని, ఆయన అనుకున్నట్టుగా విజయం కూడా సాధించారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పరిపాలన అందిస్తున్నారని ఆయన వివరించారు. గ్రామం తరపున పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మామిళ్ళ బలరాం,కూరాకుల రామజనేయులు, తానికొండ వినయ్, బుగ్గల రవి, నెర్సు సతీష్, కొలుసు సుకుమార్ , పంది శ్రీను, కూరాకుల నాగమధు,కేసుబోయిన బాబీ, కేసుబోయిన వంశీ, మేకల వంశీ మామిళ్ళ రామకృష్ణ పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల సందర్భంగా పరిగి పోలీసు వారి
## ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశం

పరిగి పట్టణంలోని స్వాగత్ ఫంక్షన్ హాల్ లో వినాయక ఉత్సవాల సందర్భంగా శాంతి సమావేశాన్ని నిర్వహించడం జరిగింది ముఖ్య అతిథులుగా వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి..!!



వికారాబాద్ జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాలు శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని పరిగి అంటేనే పీస్ అని పరిగి లో మంచి వాతావరణం ఉంటుందని తెలియజేశారు మున్సిపల్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు కార్యక్రమంలో హిందూ ముస్లిం మత పెద్దలు వివిధ పార్టీల నాయకులు అన్ని డిపార్ట్మెంట్లకు సంబంధించిన అధికారులు యువజన సంఘాల నాయకులు వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఐ టి డి ఎ పిఓ పరిశీలన

- అప్రమత్తంగా ఉండాలని అదేశాలు



విఆర్ పురం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యా లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పణశ్రీ సూచించారు బుధవారం లోతట్టు గ్రామం ఆయన శ్రీరామగిరి లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు అర్ ఐ రామకృష్ణ వి ఆర్ ఓ రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

## వరద గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన



వి అర్ పురం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి, శబరి నదులు వరద పెరుగుతున్న దృష్ట్యా మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో బుదవారం సీపీఎం బృంద నాయకులు పర్యటించారు. నీట మునిగే కుటుంబాలు తగు జాగ్రత్తగా ఉండాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ సూచించారు. గ్రామం వద్ద సీతంపేట శ్రీరామగిరి మధ్య గోదావరి వరద రోడ్డు బ్లాక్ చేయడంతో మోకాటి లోతు నీళ్ళల్లో రోడ్డు దాటి అవతలకు సీపీఎం నాయకులు చేరుకున్నారు. తక్షణం అధికారులు వరద మూసి రోడ్లు మార్గం లేని గ్రామాలకు సహాయక చర్యలు చేపట్టాలని నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు పులి ధర్మరాజు గుండేపూడి లక్ష్మణరావు కమ్మిచిచ్చు సత్యనారయణ నల్లారపు ప్రకాశరావు కాంతారావు సోడి మల్లయ్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి అడ్డరోడ్డులో అన్ టీ టీ కొట్టు ప్రారంభోత్సవానికి
## మిగిలిన భోజనాన్ని నిరుపేదలకు పంపిణీ



సెప్టెంబర్ సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : దివ్యాంగ్ రక్ష క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ కలెక్షన్ స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే ఈ కార్యక్రమానికి సంబంధించి పొదిలి కొత్తూరు అడ్డరోడ్లోని హరిత రెస్టారెంట్ ఎదురుగా ఉన్న అన్ టీ టీ కొట్టు ప్రారంభోత్సవం ఈరోజు అంగరంగ వైభోగంగా జరిగింది ఈ కార్యక్రమంలో 50 మందికి భోజనం మిగిలింది భోజనాన్ని దివ్యాంగు రక్షక్ ఫౌండేషన్ కి కాల్ చేసి అన్ని ఇవ్వడం జరిగింది భోజనాన్ని ఫౌండర్ నరసింహారావు గారి చేతుల మీదుగా పొదిలి కాలేజీ రోడ్డులోని శ్రీపతి నగర్ లో పంపిణీ చేయడం జరిగింది. టీ కొట్టు మంచి లాభాలతో జరగాలని భోజనం అనుకున్న పేదలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించడం జరిగింది. కార్యక్రమంలో ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి, రాధా, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## వర్షాలు వరదలకు నష్టపోయిన
## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆత్మకూరు వనపర్తి జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : భారీ వర్షాలకు వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఒక్కో రైతు కుటుంబానికి లక్ష రూపాయల నష్టపరిహార ప్రభుత్వం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్. రాజు డిమాండ్ చేశారు. ఇండ్లు పడిపోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని పదుల సంఖ్యలో ఇండ్లు కూలిపోయాయని వందల సంఖ్యలో ఇండ్లు దెబ్బతిన్నాయని క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంట నష్టపోయిన రైతులకు లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఇండ్లు పడిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇప్పటివరకు ప్రభుత్వ యంత్రాంగం ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించలేదని ఇప్పటికైనా ప్రతి గ్రామంలో ప్రభుత్వ అధికారులు పర్యటించి వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనా వేయాలని ఆత్మకూరు తహసిల్దార్ రాజు కు సిపిఎం పార్టీ మండల కమిటీ తరపున వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు

## దళిత మోర్చారాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన
## రాష్ట్రఅధ్యక్షునికి ధన్యవాదములు లిలిలి

## డా జాడి రామరాజు నేత



ఏటూరునాగారం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : సెప్టెంబర్ 4 రోజున బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాష్ట్ర పార్టీ నాయకులకు జిల్లా అధ్యక్షులు జిల్లా పార్టీ నాయకులకు మండల పార్టీ నాయకులకు నాకు రాష్ట్ర దళిత మోర్చా అధికారప్రతినిది పదవి రావడానికి సహకరించిన నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేరు పేరు నా ధన్యవాదములు తెలియచేస్తున్నాను అదే విదంగా నాయకునిగా కాకుండా క్రమ శిక్షణ కలిగిన కార్యకర్త గా పార్టీ అభివృద్ధికోసం కృషిచేస్తానని డా జాడి రామరాజు నేత అన్నారు అదే విదంగా నామీద నమ్మకం తో భారతీయజనతా పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు దళిత మోర్చా హన్మకొండ జిల్లా ఇంచార్జి నామీద నమ్మకం తో నియమించిన దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నాను

## తూఫాన్ బాధితులకు

# అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం

- సహాయంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుంది
- ప్రశంసించిన జిల్లా కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




శ్రీకాకుళం **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** తూఫాన్ బాధితులకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నిలవటం హర్శనీ యమని, ముందస్తు సేవలకు, నిస్వార్థ సేవలకు చిరునామ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అని జిల్లా కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాష్ట్రమంతా వరదలతో బాధపడుతున్న బాధితుల సహాయార్థం ఇరవై ఐదు వేల రూపాయలను సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అందించటం గొప్పవిషయమన్నారు. ప్రతి రోజూ పలు పత్రికలలో వస్తున్న నిత్య సేవా కథనాలను చూస్తున్నామని, నిరంతర నిస్వార్థ సేవలు కొనసాగించాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలని, విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగాడే అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించి అందరిలో చైతన్యం తేవాలన్నారు. లైన్స్ మెంటర్ నటుకుల మోహన్ మాట్లాడుతూ జోన్ చైర్మన్ పొన్నాడ.రవి, అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డా.పైడి.సింధూరల సహకారంతో సేవలు విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ ఛైర్పర్సన్ ఉర్లం.శివతేజ, సభ్యులు గుత్తూ.చిన్నారావ్, డా.పైడి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులు పూజించాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,**సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పూజించాలనే పోస్టర్లను జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరి పైనా ఉందని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు నీటిలో కరగడానికి చాలా సంవత్సరాలు పడుతుందని తెలిపారు. చెరువు మట్టితో తయారు చేసే విగ్రహాలు నీటిలో తొంతరగా కరగడంతో పాటు రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 8 అంగుళాల పరిమాణం గల మట్టి గణపతులను ప్రజలకు అందించాలని సూచించారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతుల ప్రతిష్ట ప్రయోజనాల గురించి తెలిపే పోస్టర్లను పలు చోట్ల ప్రదర్శిస్తామని మండలి ఈఈ బి.భిక్షపతి, ఎఈ సి.హెచ్.వీరేష్ తెలిపారు. ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన

# కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు



కాకినాడ జిల్లా, జగ్గంపేట, కిర్లంపూడ **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొదిరెడ్డ సుబ్బారావు తండ్రి తాతారావు మరణించడంతో వారి కుటుంబాన్ని, జగ్గంపేట గ్రామానికి చెందిన మీసాల చినబాబు తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని, ఊక శ్రీను మరణించడంతో వారి కుటుంబాన్ని కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం సర్పంచ్ భర్త మరణించడంతో వారి కుటుంబాన్ని సీతా రాంపురంలో సారా నాగరాజు చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, చదరం చంటిబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి, జంపన రవి వర్మ, కొంద్రోతు శ్రీను, పలివెల ఏసు రాజు, గల్లా శ్రీను, గల్లా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల విజేతలు

# బూరుగుపూడి, దివాన్ చెరువు, మల్లేపల్లి



కాకినాడ జిల్లా, జగ్గంపేట, కిర్లంపూడి,**సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కుంచే తాతాజీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆగస్టు 27వ తేదీ కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ చే ప్రారంభమై సెప్టెంబర్ మూడో తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగాయి ఈ పోటీలలో మొదటి విజేతగా నిలిచిన కిర్లంపూడి మండలం బూరుగుపూడి జట్టుకు 20000 రూపాయలు ప్రైజ్ మనీ కుంచే తాతాజీ అందించారు. రెండవ విజేతగా నిలిచిన దివాన్ చెరువు జట్టుకు పదివేల రూపాయలు ప్రైజ్ మనీ పాఠంశెట్టి విశ్వనాథం అందించారు. మూడో విజేతగా నిలిచిన గండేపల్లి మండలం మల్లేపల్లి జట్టుకు ఐదు వేల రూపాయలు ప్రైజ్ మనీ ఆడప నాని అందించారు. ఈ పోటీలలో కబడ్డీ విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ ఎల్జి సర్వీస్ సెంటర్ బత్తుల దుర్గాప్రసాద్, బత్తుల రాజేష్ సోదరులు అందించడం జరిగింది ఫైనల్ మ్యాచ్లో సూపర్ రైడర్స్ కి స్మార్ట్ వాచెస్ బహుమతిగా వేణు మల్లేష్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంచే తాతాజీ, కుంచే శ్రీనివాస్, పాఠంశెట్టి విశ్వనాథం, రామి శెట్టి రాజు,, కర్నాకుల పెద్దకాపు, పాఠంశెట్టి బాబ్జి, కర్ణాకుల సూరిబాబు, బాలుకుల చిన్నోడు, సోము పుచ్చయ్య, ముర సత్తిబాబు, గురజాపు సత్తిబాబు, కన్ని శ్రీను, టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులు దెబ్బతిన్న ఇల్లు రోడ్లు కల్వర్టులు

## బ్రిడ్జిలు పంట నష్టం వెంటనే అంచనాలు వేయాలి.

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ కురగంటి. రాంబాబు

**సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**వరదకు దెబ్బతిన్న ప్రతి కుటుంబాన్ని అన్ని విధానాలు ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో మండల కేంద్రాలలో గ్రామాలను అనుసంధానం చేస్తూ ఉన్న రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారీ వర్షాలు వరదలతో నష్టపోయిన ఇల్లు పంట పొలాలు మినీ బ్రిడ్జిలు కల్వర్టులు రోడ్లకు సంబంధించిన నష్టం వెంటనే సంబంధిత అంచనాలు అధికారులు సిద్ధం చేయాలని ఏ ఒక్కరు కూడా నష్టపోకూడదు అని వరదల కారణంగా నష్టపోయిన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రజలకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్ అండ్ బి ఇరిగేషన్ హౌసింగ్ వ్యవసాయ విద్యుత్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే అంచ నాలు తయారు చేయాలని వాటికి కావాల్సిన నిధులు ప్రభుత్వపరంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వరద బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనగల సత్తా ఉన్న నేత తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వరద సహాయక కార్యక్రమాలలో పాల్గొని వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి మౌలిక సదుపాయాలు భోజనం ఏర్పాట్లను చేసిన ఎన్డీఏ కూటమి నేతలు అధికారులకు ప్రతి ఒక్కరికి రాంబాబు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..



కాకినాడ జిల్లా, గండేపల్లి, **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు కి నీలాద్రి రావుపేట కి మధ్యలో ఉన్న ఇండియన్ ఆయిల్ దగ్గర216 రోడ్డు ప్రమాదం.. ఆగి ఉన్న లారీ టాంకర్ ని అతివేగంగా వెనకనుంచి డి కొనడంతో అక్కడికక్కడే యువకుడి మృతి. విజయవాడ నుంచి తుని వెళుతుండగా రోడ్డు ప్రమాదం.. వివరాలు ఇంకా తెలియాల్సింది. అక్కడి కక్కడే మృతి చెందిన ద్విచక్ర వాహనదారుడు తుని గ్రామానికి చెందిన వాడుగా గుర్తించిన గండేపల్లి ఎస్సై..

## జయగిరి అంగన్ వాడి సెంటర్

## టూ లో పోషక ఆహార వారోత్సవాలు

### గ్రామ కార్యదర్శి రవి గౌడ్



హసన్ పర్తి మండలం **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** హసన్ పర్తి మండలంలోని గ్రామం జయగిరిలో అంగన్వాడి సెంటర్ 2 లో ఈరోజు పోషక ఆహార వారోత్సవాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామపంచాయతీ కార్యదర్శి రవి గౌడ్ హాజరై ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాల సీజన్లో పిల్ల తల్లులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు, జాగ్రత్తలు ప్రకటించాలి, ముఖ్యంగా ఈ వర్షాకాల సీజన్లో జలుబు, దగ్గు, జ్వరం, విరోచనాలు, ఇలాంటివి ఈ వర్షాకాల సీజన్ లో తరచుగా వస్తాయి కనుక పరిసరాల పరిశుభ్రతను పాటించాలి, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి, పిల్లలకు పాలు పట్టించే క్రమంలో శుభ్రతను పాటించాలని తెలియజేశారు, అంగన్ వాడి టీచర్ ఆర్. సువర్ణ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, మంచి పోషకాహారాలను మాత్రమే తినాలి,పండ్లు, పప్పు దినుసులను, మొలకెత్తిన విత్తనాలను, తీసుకోవడం వల్ల తల్లికి బిడ్డకు కావలసిన అంత ప్రోటీన్స్ లభిస్తుందని అప్పుడు తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని అప్పుడప్పుడు చిన్న చిన్నగా వాకింగ్ లాంటివి చేయాలని గర్భిణీ స్త్రీలకు తెలియజేశారు అనంతరం చిన్నపిల్లలను బరువు కొలతలను చేయడం జరిగింది బరువు తక్కువ ఉన్న పిల్లలకు పోషకాహార లోపంగా గుర్తించి వారికి ప్రత్యేకంగా పాలు,గుడ్లు, బాలామృతం పంపిణీ చేయడం జరిగింది అలాగే పిల్లల తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పరచడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ చింత విజయ, పిల్లల తల్లులు పరమేశ్వరి, శోభ, స్రవంతి, మేఘన, పద్మ, కోమల,తదితరులు పాల్గొన్నారు

## బట్టబయలైన సైలాడ

## సచివాలయ ఉద్యోగుల డొల్లతనం.........



ఆమదాలవలస **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** నియోజకవర్గంలో పరామర్శలకు వెళుతున్న క్రమంలో సైలాడలో ఆకస్మికంగా సచివాలయాన్ని తనిఖీ చేసిన గౌరవ శాసనసభ్యులు శ్రీ కూన రవికుమార్ గారు.. ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించగా వెలుగులోకి వచ్చిన బాగోతాలు ఏ ఉద్యోగి కూడా 10 గంటల సమయానికి సచివాలయానికి చేరుకోకుండా ఎమ్మెల్యే గారు వెళ్లే సమయానికి ఇద్దరు ఉద్యోగులు మాత్రమే అందుబాటులో ఉండడం జరిగింది మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించగా వాళ్ల నుండి సరైన



సమాధానం దొరకలేదు దీనితో హాజరు రిజిస్టర్ ని పరిశీలించగా సక్రమంగా విధులకు రాకుండా గైర్హాజరవుతూ ఉద్యోగుల హాజరు రిజిస్టర్లో దొంగ సంతకాలు పెడుతూ సక్రమంగా విధులు నిర్వహించకుండా ఎవరికి నచ్చిన విధంగా వాళ్లు ఉన్నత అధికారులకు ఎటువంటి ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా సెలవులు పెట్టేస్తూ సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన గౌరవ ఎమ్మెల్యే కూన రవికుమార్ సక్రమంగా విధులు నిర్వహించని కొందరు సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ గారికి మరియు సంబంధిత అధికారులకు కంప్లైంట్ చేయడం జరిగింది ప్రజలకి సరైన సేవలు అందకపోతే ఉద్యోగులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలియజేస్తూ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## వీధులలో చెత్త పోగులు తీయకుంటే...

# ఇంటిలలో రోగాలు తిష్ట వేస్తాయి.



ఆమదాలవలస.**సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :** గ్రామంలో గల వీధులలో చెత్త పోగులు తీయకుంటే, ప్రతి ఇంటిలో రోగాలు తిష్ట వేస్తాయి అని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏ.పి.ఎం. పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం స్థానిక కొర్లకోట పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో జరిగిన శానిటేషన్ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నీటి నిల్వలు పేరుకుపోయిన ప్రాంతాలు తో పాటు, రోడ్డు పక్క చెత్త పోగులు వేస్తున్న ప్రాంతాలను పరిశీలించి త్వరితగతిన తొలగించడానికి సూచనలు చేశారు . ఫీవర్ సర్వే ప్రకారం గ్రామాలలో నీటి నిల్వలు, చెత్త పోగులు ఉండడం వల్ల దోమలు అభివృద్ధి చెంది ,ప్రజలు అనేక రకాల రోగాల బారిన పడుతున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బంది ,ఆరోగ్య కార్యకర్తలు ,ఆశా వర్కర్లు, అందరూ సమిష్టిగా పనిచేసి గ్రామాలలో ఏ రకమైన సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగర్ తో పాటు సచివాలయ సిబ్బంది ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గురుకుల హాస్టల్ లో పరిసరాలను సందర్శించి, పిల్లల

## ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్న జుట్టుక నాగేశ్వరరావు



కాకినాడ జిల్లా, జగ్గంపేట, **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**గురుకుల హాస్టల్స్ లో విద్యార్థులకు హాట్ వాటర్ అలాగే దోమతెరలు ప్రతి కిటికీకి మెస్ కిటికీ డోర్లకు చుట్టూ ఉన్న ప్రదేశం పరిశుభ్రత చేసి ఈ కాలంలో వచ్చే పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేసి క్లోరిఫైడ్ దోమల మందు పిచికారి చేయాలని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జి జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం జగ్గంపేట అంబేద్కర్ గురుకుల హాస్టల్కి వెళ్లి పరిసరాలు చూసి ప్రెస్ మీడియా తో మాట్లాడుతూ, ఈ నెల అంతా ఎప్పుడు పడలేని విధంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ, మన రాష్ట్రంలో చాలా చోట్లా నీట మునగడం మనం చూస్తున్నాం. బయటకి రావాలంటేనే చాలా మంది బయపడ్తున్నారు. అసలే బయట వాతావరణం బాగోలేదు ఈ సమయంలోనే చాలా రకమైన విష జ్వరాలు వస్తుంటాయి.కావున మనం అందరం గమనించి ఆరోగ్య విషయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే హాస్టల్లో వున్నా ప్రతీ పిల్లల ఆరోగ్య విషయం లో చాలా జాగ్రత్త వహించాలని, ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే టెస్ట్ లు చేయించాలని, హాస్టల్లో దోమలు రాకుండా మందు కొట్టాలని, పిల్లల అందరికి హాట్ వాటర్ ఇవ్వాలని, గురుకుల హాస్టల్ ప్రిన్సిపాల్ ని కోరారు.

## వరద బాధితులకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం



రేపల్లె **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**వరదల వలన నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన బొర్రా రమేష్ అన్నారు బుధవారం వరద బాధితుల కొరకు లక్ష రూపాయాలు ఆర్థిక సహాయం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖా మాత్యులు అనగాని సత్యప్రసాద్ అందజేశారు దీనితో అనగాని సత్యప్రసాద్ బుర్ర రమేష్ ను అభినందించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కేసన సోమయ్య, ఎంపీటీసీ సురేంద్ర, లుక్కా సోమేష్, కేసన పగిడియ్య స్వామి, బొర్రా రాఘవరావు, బొర్రా శ్రీరామమూర్తి, మోర్ల రమేష్ బాబు, చింత సింహ మరియు తదితరులు పాల్గొన్నారు...

## వ్యక్తిగత పరిశుభ్రత తో ఆరోగ్యం. సూపర్వైజర్ సంపూర్ణ.



పొన్నూరు **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యానికి మూల సూత్ర మని చింతలపూడి అంగన్వాడి సెక్టార్ సూపర్వైజర్ సంపూర్ణ అన్నారు.పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో బుధవారం పోషణ్ పక్వాడ మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.వైద్య శిబిరం నిర్వహించి అంగన్వాడి పరిధిలోని ప్రజలకు పోషణ్ పక్వాడ మాసోత్సవాల ప్రాధాన్యతను వివరించారు.హ్యాండ్ వాష్,మొక్కలు నాటడం కార్యక్రమాలు చేపట్టారు.ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వైద్య సిబ్బంది వివరించారు.

## పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం.

### ఐసీడీఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మి.



కోట్ పల్లి **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**పోషణ మాసంలో భాగంగా మండల పరిధిలోని రాంపూర్ అంగన్వాడీ కేంద్రం లో గర్భిణీ, బాలింతలు, చిన్నారులతో పోషణలతో కూడిన ఆహార పదార్థాలు వాటి పై అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు ముందు కెళ్తోందనీ. ఇందుకోసం యేటా పోషణ్ అభియాన్ పేరిట మాసోత్స వాలను నిర్వహిస్తున్నది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి చివరి




వారం వరకు పోషణ మాస కార్యక్రమం నిర్వహించి గర్భిణీ, బాలింతలకు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి అప్పుడు పుట్టే బిడ్డ ఎదిగే శిశువు సంపూర్ణ ఆరోగ్యం తో ఉంటారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తలారి వినోద, కొత్రికే సూర్యకాల, గ్రామ ఏఎన్ఎం అంజాలి, ఆశ వర్కర్లు, గర్భిణీ, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో బ్లీచింగ్, సున్నం పంపిణీ.



పొన్నూరు **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని తాడిపర్రు, దండమూడి, ఆరెమండ, గ్రామాలలో బుధవారం పొన్నూరు మండల జనసేన అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో సచివాలయాల్లో సున్నం, బ్లీచింగ్ పంపిణీ చేశారు. అకాల వర్షాలకు ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులలో భాగంగా సున్నం, బ్లీచింగ్ పంపిణీ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు మీడియాకి తెలిపారు.జిల్లా నాయకులు మేకల రామయ్య,మండల నాయకులు చందు శివ కోటేశ్వరావు, పచ్చలతాడిపర్రు గ్రామ అధ్యక్షులు వేంపాటి రాజేష్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు జనసేన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ మోసాలపై

## ఖాతాదారులకు అవగాహన కల్పించిన ఎస్సై



అమరచింత వనపర్తి జిల్లా **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**ఇటీవల జరుగుతున్న సైబర్ మోసాలపై యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు అమరచింత ఎస్సై బి సురేష్ బుధవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకు వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్, యూనియన్ బ్యాంకు మేనేజర్ శివశంకర్ సైబర్ మోసాల పై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు లోన్ ఇస్తామని సెల్ ఫోన్లకు లింకులు పంపిస్తే వాటిని ఓపెన్ చేయరాదని సూచించారు. అలాగే తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మాయమాటలతో ఓటీపీ చెప్పమని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపి చెప్పరాదన్నారు. బ్యాంకు నుండి ఖాతాదారులకు ఓటిపి చెప్పమని ఎలాంటి కాల్స్ రావన్నారు. ఏటీఎం కార్డు సీక్రెట్ నంబర్లు చెప్పమని బ్యాంకు నుండి ఫోన్లు రావన్నారు. ప్రభుత్వ స్కీములంటూ ఫోన్ చేసే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని మేనేజర్ శివ శంకర్ సూచించారు. అజాగ్రత్తగా ఉంటే మన ఖాతాలోని డబ్బంతా క్షణాల్లో ఖాళీ అవుతుందన్నారు ఇలాంటి సంఘటనలు చాలా వరకు జరుగుతున్నాయని ఎస్సై మేనేజర్ అన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ మాట్లాడుతూ మెల్లగా ఉచ్చు లోకి దింపుతారని అలాంటి ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను

# పరామర్శించిన బండి రజని కుమార్



హసన్ పర్తి మండలం **సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :**హసన్ పర్తి మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు రామంచ వినోద్ తండ్రి రామంచ రాములు అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకుని అనంతసాగర్ గ్రామానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి గ్రామ పార్టీ నాయకులతో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించిన హసన్ పర్తి మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు డా. బండి రజినీ కుమార్, అనంతరం తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న వినోద్ కి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సుధాకర్, సంపత్, పవన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని అధికారులు






నార్పల సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు ఇస్తా రీతిన కార్యాలయానికి రావడం జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. సమయం 11.30 కావస్తున్న కార్యాలయంలో బుధవారం సీట్లు ఖాళీగా దర్శనం ఇచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కారం లోనే కాకుండా, కార్యాలయానికి రావడానికి కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వికారాబాద్ జిల్లా లోని కుమ్మరి కులవృత్తుల వారిని ప్రోత్సహించడానికి పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులను పూజించాలి ..!!

### జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అదికారి కుంభం.ఉప్పెందర్ ఒక ప్రకటనలో తెలిపారు...!!



వికారాబాద్ జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : వికారాబాద్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయం నుండి శిక్షణ పొందిన కుమ్మరుల వద్ద నుండి మట్టి గణపతులు విక్రయించాలని తెలియ జేశారు. మట్టి గణపతులు కావలసిన వారు వీరిని సంప్రదించగలరు వికారాబాద్ నియోజక వర్గం లో కుమ్మరి అంజిలయ్య ఫోన్ నెంబర్. 9966466982, పరిగి నియోజక వర్గం లో కుమ్మరి గౌరీ శంకర్ ఫోన్ నెంబర్ 9676038986 , తాండూర్ నియోజక వర్గం లో కుమ్మరి శ్రీశైలం ఫోన్ నెంబర్. 9640518846, మరియు కోడంగల్ నియోజక వర్గం లో కుమ్మరి అంజిలయ్య ఫోన్ నెంబర్ 9391645200. వికారాబాద్ జిల్లా కలెక్టర్ గారు ప్లాస్టర్ అఫ్ పారిస్ ని నిర్మూలించడానికి చర్యలు చేపడుతున్నామని మట్టి గణపతులను పూజించాలని రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్స్,మున్సిపల్ కమీషనర్లు లను .తహిసిల్దార్లను, యం.పి.డి.ఓ లను యువజన సంఘాలను కోరనైనదిజిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి..!!

## అర్చరి విద్యలో జాతీయస్థాయికి సాకే సంతోష్





నార్పల సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మండలంలోని దుర్గం గ్రామానికి చెందిన సాకే సంతోష్ అర్చరి (విలువిద్య) లో తన ప్రతిభను చాటుకుంటున్నాడు. సంతోష్ తండ్రి సాకే మారెన్న సిద్ధరాచర్ల గ్రామ నౌకరుగా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయంలో సాకే సంతోష్ 9వ తరగతి చదువుతూ, అర్చరి (విలువిద్య) లో తన ప్రతిభను చాటుతూ జిల్లా స్థాయిలో 4 సార్లు, రాష్ట్రస్థాయి పోటీల్లో 3 సార్లు పాల్గొనడం జరిగిందని సాకే మారెన్న తెలిపారు. ఈనెల 26న జాతీయ స్థాయి ఢిల్లీలో జరిగే అర్చరి పోటీల్లో సాకే సంతోష్ పాల్గొంటున్నాడని సాకే మారన్న వెల్లడించారు.

## క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ

### సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతిస్తూ



ఏలేశ్వరం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతిస్తు క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ కుల జన గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తారీఖున హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన మహాసభ ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర సదస్సుని జయప్రదం చేయాలని సిపిఐ. ఎం.ఎల్ పార్టీనాయకత్వంలో ఏలేశ్వరం తాసిల్దార్ కార్యాలయం వద్ద.కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ కోసిరెడ్డి గణేశ్వరరావు సిపిఐ ఎంఎల్ పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి. సోమల కోసల గిరిజన సంఘం నాయకులు నాగులపల్లి అర్జునుడు. మాట్లాడుతూ. రిజర్వేషన్లు పొంది అభివృద్ధి చెందిన కుటుంబాలకు రిజర్వేషన్ రద్దుచేసి అనేసి బద్ద వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ద్వారా అభివృద్ధి చెందిన కుటుంబాలకే రిజర్వేషన్ ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ సుందరయ్య పవన్ లో జరుగు సదస్సును విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వర రావు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కారు వెంకటరమణ తీగల రాజారావు నాని శెట్టి పెద్ద సత్తిబాబు కందుల కృపా ప్రసాద్ త తదితరులు పాల్గొన్నారు

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు




నందలూరు,సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సుచిత్ర పేర్కొన్నారు. మండలం లోని పాటూరు పంచాయతీ కుమ్మరపల్లి గ్రామం లో జిల్లా వనరుల కేంద్రం అధికారులు బుధవారం పర్యటించి రైతులకి గ్రామ సభ నిర్వహించటం జరిగింది. గ్రామ సభ లో రైతులకి వరి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేశారు. అదే విధంగా కడప కె వి కె కేంద్రం నుండి వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య రైతుల యొక్క వరి పంట పొలాలను పరిశీలించి పాము పొడ తెగులు నివారణకు సూచనలు తెలియచేశారు. అనంతరం రైతులకు తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమం లో మండలం వ్యవసాయ అధికారి మల్లికార్జున, పాటూరు రైతు సేవా కేంద్రం ఎం పీ ఈ ఓ సాయి ప్రియ, కుమ్మర పల్లి గ్రామ రైతులు, సచివాలయం వాలంటీర్ శివ కుమార్ పాల్గొన్నారు.

## సుందరయ్య కాలనీవాసులను అధికుంటాం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.



గుంటూరు జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : పెదకాకాని మండలం సుందరయ్య కాలనీ వాసులను అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం ఎం పార్టీ నాయకులు ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. వరదకు ముంపుకి గురైన ప్రాంతాలు సుందరయ్య కాలనీ దర్గా ప్రాంతాలలో పర్యటించి సుందరయ్య కాలనీలో ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు .ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఒకేసారి ముంచేతటంతో సుందరయ్య కాలనీ లో నివాసాలన్నీ మునిగిపోయి కట్టుబట్టలతో వారందరినీ రెవెన్యూ అధికారులు పున రావస కేంద్రాలకు తరలించారని భోజనం మంచినీరు సౌకర్యం ఏర్పాటు చేశారని కాలనీలో వరద నీరు తగ్గటంతో తిరిగి కాలనీవాసులు వారి ఇళ్ళకి చేరుకొని ఇంటిలో మేటేసిన బురద తొలగించి ఇంటిలో నివాసం ఉండే ప్రయత్నం చేస్తున్నారని సకలం సామానులు నిత్యవసర వస్తువులు పిల్లల బుక్స్ నీటిలో నానిపోయాయని కలెక్టర్ నాగలక్ష్మి కి మెమోరాండం అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా బియ్యం, కందిపప్పు, చెక్కెర నిత్యవసర సరుకులు ఇస్తామని వర్షానికి దెబ్బతిన్న ఇండ్లు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వం ఇచ్చే సహాయం అందరికీ చేరేలాగా చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని మండల తహసిల్దార్ , ఎండిఓ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి రాజా రమేష్, హౌసింగ్ పీడీ , విఆర్వోలు, ఉపసర్పంచి వలివేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అండగా శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్

### సహాయ కార్యక్రమాలకు 6లక్షల రూపాయలు విరాళం




నార్పల, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : అందించిన బొందలవాడ శివకృష్ణచౌదరి వరద ప్రాంతాల్లో సేవ లందిస్తున్న శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్, చంద్రదండు బృందం అనంతపురం జిల్లాలో నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ.. మరొక్క మారు తన మానవత్వాన్ని చాటుకుంది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరదల తాకిడితో పలు ప్రాంతాలు నీట మునిగి అతలాకుతలం అవుతుందటంతో తమ వంతు సేవలను ప్రజలకు అందించడానికి శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ బృందం రంగంలోకి దిగింది. ఈ సేవా కార్యక్రమాల నిర్వహణకు శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ బొందలవాడ శివకృష్ణచౌదరి 6 లక్షల రూపాయలు విరాళం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చంద్రదండు ప్రకాష్ నాయుడు పర్యవేక్షణలో శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చంద్రదండు బృందంతో కలసి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సింగ్ నగర్, పాయకాపురం, కండ్రిగ తదితర ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇప్పటి వరకు దాదాపు 3000 మందికి ఆహారం పొట్లాలు , వాటర్ బాటిల్స్, పాలు, బ్రెడ్లు అందించడం జరిగింది అలాగే బాధిత కుటుంబాలకు మెడిసిన్, వైద్య సేవలు అందిస్తున్నారు.

## శంకర్పల్లి రైల్వే బ్రిడ్జి పై నా గుంతల మయమై రహదారులకు ఇబ్బందులకు గురై అవుతున్న రహదారులను పరిశీలించిన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి...!!



వికారాబాద్ జిల్లాసెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : చేవెళ్ల నియోజకవర్గం లోని శంకర్పల్లి మున్సిపల్ మరియు మండల కేంద్రంలోని , రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పైన, క్రింది బాగంలోని గుంతల మయమైన రోడ్డును పరిశీలించి , అధికారులకు ఆదేశాలిచ్చిన, చేవేళ్ళ పార్లమెంట్ సభ్యులు కోండా విశ్వేశ్వర్ రేడ్డి, ఆనంతరం రావులపల్లి గ్రామానికి వేళ్ళే రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో సంభందించిన అధికారులకు కుడా వేంటనే పనులు చేప్పట్టలని , ఎంపి , హేచ్చరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎంపి తో పాటు, మాజి ఎమ్మేలే కేవిఎస్ రత్నం , బిజేపి పార్టి ప్రతినిధులు, మాజి ప్రజాప్రతినిధులు, సినియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నరు..

## సొంగా రోషన్ కుమార్ అడుగుజాడల్లో చింతలపూడి నియోజకవర్గ నాయకులు...



చింతలపూడి,సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : విజయవాడ 45 వ డివిజన్,జోజి నగర్ పలు కాలనీలలో వరద ముంపు ప్రాంతాలకి సహాయ కార్యక్రమంలో పాల్గొనుటకు,రెండవ రోజు తమ వంతు సహాయ కార్యక్రమం చేయటానికి బయలుదేరి చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పిలుపు మేరకు వరదబాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్న చింతలపూడి నియోజకవర్గ నాయకులు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను ఈ కార్యక్రమంలో ఆపదలో ఉన్న విజయవాడ ప్రజలకు ఆహారం, మంచినీటి పదార్థములు ఆహారం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఇబ్బంది పడుతున్న నిత్యవసరాలు తెచ్చుకోలేని స్థితిలో ఉన్న ఎటు చూసినా నీరు ఉన్న వాళ్ళకి తగిన ఆహార పదార్థాలు త్రాగు నీటి అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్ వైఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి అన్నపరెడ్డి గంగాధర్,నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కంకిపాటి నరేష్,నాయకులు వైట్ల ఆంజనేయులు,వైట్ల రాజు,మర్రి కిరణ్ కట్టా సతీష్, పొదిల జేమ్స్, చిట్టిబాబు నాయకులు పాల్గొన్నారు.

## వరద పెరగొచ్చు అప్రమత్తంగా ఉండండి



వి.ఆర్.పురం,సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : గోదావరి శబరి వరదల వలన ముంపునకు గురైన చింతరెగుపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప గ్రామాలలో చింతూరు సబ్-కలెక్టరు, రంపచోడవరం (గోదావరి శబరి వరదల ప్రత్యేక అధికారి, వి.ఆర్.పురం మండలం) పర్యటించి గోదావరి- శబరి వరద పరిస్థితులను గ్రామస్తులకు వివరించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు. భద్రాచలము వద్ద పెరగవచ్చునని క్రమముగా వరద నీటి మట్టము సిడబ్ల్యుసి వారి ముందస్తు అంచనాల ద్వారా తెలియవస్తున్నదని ప్రజలందరూ అప్రమత్తముగా ఉండి ఎటువంటి ప్రాణ నష్టము జరగకుండా జాగ్రత వహించవలసినదిగా గ్రామస్తులకు తెలియజేశారు. వారికి అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించినారు. ప్రభుత్వం వైపు నుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించలని అధికారులను ఆదేశించియున్నారు. వరద బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు నిరంతరం పని చేస్తున్నారని, గోదావరి- శబరి వరద సంబందిత సమాచారము కొరకు లేదా సహాయము కొరకు తహశీల్దారు వారి కార్యాలయము వి.ఆర్.పురం నందు ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెం. 7331179088 24/7 కాల్ చేయవచ్చునని తెలియపరచినారు. ఈ కార్యక్రమము నందు తహశీల్దారు, ఎంపిడిఓ, సిఐ ఏటపాక, మెడికల్ ఆఫీసర్ రేఖపల్లి మరియు జీడిగుప్ప, ఏఈ ఆర్ బ్ల్యుఎస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొనియున్నారు.

## ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం.

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్



కోటపల్లి సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ :ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అన్నాడు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాలమేరకు బుధవారం కోట్ పల్లి మండల పరిధిలోని బార్వాద్, ఎంకేపల్లి,కొత్త పల్లి, ఎన్నారం తదితర గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయ నిదికింద లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన నలుగురికి మద్గుల్ తండాకు చెందిన ఒకరికి మొత్తం 5 మందికి అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఎవరికి ఆపద వచ్చిన ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నర్సిములు, మాజీ ఎంపిటిసి నర్సింహారెడ్డి, నాయకులు రాంచందర్ రెడ్డి, ఎన్నారం మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మందుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రాచయ్య, మల్లేష్ యాదవ్,అనంతరాం గౌడ్, మైపాల్ రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ..... కొత్తపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ నాయక్

## పర్యావరణం మనకు కంటికి కనిపించని విలువైన సంపద




బాపట్ల :- సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : పర్యావరణాన్ని పరిరక్షించే ఉద్దేశంలో భాగంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో "టీమ్ సీసీఏ మరియు ఎన్ ఎస్ ఎస్ యూనిట్స్ ఆధ్వర్యములో మట్టి వినాయకుని తయారీ పోటీలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని, నాణ్యతను పరిరక్షించుకొంటూ దేశ పురోగాభివృద్ధి సాధన ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. సెక్రటరీ మానం నాగేశ్వరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మానవ జాతి ఎదుర్కొంటున్న ఒక పెద్ద సవాలు అని ఇందు కోసం విద్యార్థులు, ప్రజలు పర్యావరణానికి సంబందించిన అనేక అంశాల గురుంచి సరిఅయిన అవగాహన కల్పించు కొనవలెనని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. షేక్ నజీర్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణలో భాగంగా మట్టి వినాయకుని తయారి పోటీలు మరియు మొక్కలు నాటటం వంటి కార్యక్రమములు నిర్వహించుచున్నామని తద్వారా సుమారు 5000 మంది విద్యార్థులకు స్ఫూర్తి కలిగి వారి ఇండ్లలోను, ఇండ్ల పరిసరాల వారికి అవగాహన కల్పించి పర్యావరణ రక్షణకు దోహద పడుతారని తెలిపారు. కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ డి . నిరంజన్ బాబు మాట్లాడుతూ పర్యావరణం మనకు కంటికి కనిపించని విలువైన సంపద అని ఆ సంపదను మన భావి తరాలకు అందించవలసిన భాద్యత ప్రతి పౌరునికి ఉందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రం మరియు నగదు బహుమతి అందచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేసినారు.

## నేనుకూడా బిజెపిలో సభ్యుడనే

### భారత జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



ఏలేశ్వరం,సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : కాకినాడ జిల్లా పార్టీ ఆఫీసులో భారతీయ జనతా పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం లో భాగంగా జిల్లా భారతీయ జనతా పార్టీ ఆఫీసులో అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రేలంగి. శ్రీదేవి సారధ్యంలో మొట్ట మొదట సభ్యత్వం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ కి మరియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఉమ్మిడి.వెంకట్రావు ఏలేశ్వరం రూరల్ మండలం అధ్యక్షుడు కూరాకుల రాజాకి ప్రత్తిపాడు భారతీయ జనతా పార్టీ వైస్ ప్రెసిడెంట్ వుట వీరబాబు సభ్యత్వ నమోదు ఇవ్వడం జరిగింది.



ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో సభ్యత్వ నమోదు రాష్ట్రంలో మొదటి స్థానంలో రావాలని తెలియపరచడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఉమ్మిడి. వెంకట్రావు ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు ఏలేశ్వరం రూరల్ మండలం అధ్యక్షులు కూరాకుల.రాజా ప్రత్తిపాడు మండల వైస్ ప్రెసిడెంట్ ఊటా.వీరబాబు రౌతులపూడి మండలం అధ్యక్షులు ఊట. శ్రీను లవుడు.శ్రీను మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ బిజెపి నాయకులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

## విలేరుపాడు 15 గ్రామాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



వెలేరుపాడు సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం విలీన ముంపు మండలం వేలేరుపాడు మండలంలోని , కట్కూరు ,పేరంటాలపల్లి టేకూరు తదితర15 వరద ముంపు గ్రామాలకు లాంచీపై వెళ్లి నిత్యావసర సరుకులు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. అందజేశారు గత వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని విలీన ముంపు మండలం వేలేరుపాడ రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య తదితర అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. పునరావాసం కల్పించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆర్డీఓ, సంబదిత అధికారులకు ఆదేశాలు జారీచేసారు . ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ భారీ వర్షాలకు మండలంలోని కొన్ని గ్రామాలు ముంపుకు గురి అవుతాయని ముందే అంచనా వేసి అధికారులను అప్రమత్తం చేశామని విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుకునూరు, పోలవరం నియోజకవర్గంలో ఎలాంటి వరద ముంపు జరిగినా చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్డీఓ అద్దయ్య తెలిపారు.

## అమరుల ఆశయాలతో ముందుకు సాగుదాం.....

### -విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేద్దాం....

### -పెద్దంపేట లో జరిగిన కామ్రేడ్ బండి మైసయ్య వర్ధంతి సభలో ప్రజాపంథా నేత నంది రామయ్య పిలుపు....




రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో ప్రజాపంథా సీనియర్ నాయకులు కామ్రేడ్ బండి మైసయ్య ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు నంది రామయ్య, కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, భారత దేశ విప్లవోద్యమ చరిత్రలో ఎంతోమంది అమరులు పేద ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. భూమికోసం ,భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం అలుపెరుగని పోరు కొనసాగించారు. కామ్రేడ్ బండి మైసయ్య విప్లవోద్యమ గడ్డగా పెద్దంపేట గ్రామాన్ని నిలబెట్టేందుకు తన వంతు పాత్రను పోషించాడు. పెద్దంపేట లో జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించాడు. అరుణోదయ కళాకారుడిగా, పార్టీ నాయకుడిగా పార్టీ కర్తవ్యాలను తూచా తప్పకుండా పాటించాడు. తన ఊపిరి ఉన్నంతకాలం ఎర్రజెండాను చేతబట్టి విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశాడు. కామ్రేడ్ బండి మైసయ్య లేని లోటు తీర్చలేనిది. అమరుల ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ విషయాలని విప్లవోద్యమ నిర్మాణానికి విప్లవ కార్యకర్తలంతా బాధ్యతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ వర్ధంతి సభలో గ్రామ కార్యదర్శి గొల్లపల్లి చంద్రయ్య అధ్యక్షత వహించగా, మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, పిఓడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి, పీవైఎల్ రాష్ట్ర నాయకులు పెండ్యాల రమేష్, పార్టీ జిల్లా నాయకులు అడేపు శంకర్, మార్త రాములు, కట్ట తేజేశ్వర్, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు బండి అశోక్ లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



## నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



అమరచింత వనపర్తి జిల్లా సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వనపర్తి జిల్లా అమరచింత మండలంలో నీట మునిగిన పంట పొలాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి అరవింద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమరచింతకు చెందిన సయ్యద్ మన్నన్ తనకున్న 5 ఎకరాల్లో వరి పంట వేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట మొత్తం నీట మునిగింది. సమాచారం తెలుసుకున్న ఏవో నీట ముని నా పంటను పరిశీలించారు. రైతు వివరాలను సేకరించారు. మండలంలో నీట మునిగిన పంట పొలాల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఏ ఓ అరవింద్ తెలిపారు.

# మొగల్తూరు సొసైటీపై 51వ విచారణ.

మొగల్తూరు, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మొగల్తూరు సహకార సంఘంపై 51వ విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో సంఘ ఆడిట్ అధికారులు ఆదేశాలతో 51వ విచారణ అసమయంలో చేపట్టారు. అయితే విచారణ నిలుపుదల చేసేందుకు కోర్టు స్టే కోరుతూ నాటి పాలకవర్గం ప్రయత్నించగా కోర్టు నిరా కరించింది. దీంతో గత ప్రభుత్వంలో మంత్రి నుండి స్టే తెచ్చుకున్నారు. అప్పటి నుండి విచారణ నిలుపు దల చేశారు. అయితే ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎర్పడటంతో సంఘంలో ఆగిన విచారణను తిరిగి చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు దారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువె ళ్ళారు. గత ప్రభుత్వం అప్పటి మంత్రి నుండి వచ్చిన స్టేను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా మొగల్తూరు సహకార సంఘం పరిధిలో నిలిచిపోయిన విచారణను తిరిగి ప్రారంబించాలని ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. దీనిపై జిల్లా సహకార అధికారులను సంప్రదించగా మొగల్తూరు సహకార సంఘంపై నిలిచిన 51 విచారణ స్టేను ప్రభుత్వం ఉపసంహరించుకుందని తిరిగి విచారణ ప్రారంబిస్తున్నట్టు సహకార అధికారులు తెలిపారు.

# గురుకులాల్లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ, తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి....

## టి జి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ దార మధు...



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : గురుకులాల కార్యదర్శి డా. వి ఎస్ అలుగు వర్షిణి గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం బోధన బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా టి జి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ దార మధు మాట్లాడుతూ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో గత కొన్ని సంవత్సరాల నుండి నీతి నిజాయితీగా పనిచేస్తూ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ, రెగ్యులర్ టీచర్స్ తో సమానంగా పనిచేస్తూన్న రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6000 మందిని మూడు నెలల నుండి కనీసం జీతాలు కూడా ఇవ్వకుండా, అర్ధాంతరంగా వారిని విధుల నుండి తొలగించడం ఎస్సీ ఎస్టీ , బీసీ బహుజనుల పిల్లల విద్యాభివృద్ధిని కాల వ్రాసే మీ కుట్రల ప్రణాళిక పుస్తకంలోని ఒక పాఠ్యాంశంగా పెట్టుకొని మొన్నటి వరకు ట్రాన్స్ ఫర్ లని ప్రమోషన్స్ అని విద్యా సంవత్సరం మొదలైన నాటి నుండి క్లాసులు జరగకుండా చేసి, ఇప్పుడు తాత్కాలిక ప్రాతి పదికన పనిచేసే వారిని తొలగించడం దారుణం, విద్యాసంవత్సరం మొదలైన నాటి నుండి అట్టడుగు వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యం కనుక విద్యా రంగాన్ని అన్ని విధాలుగా ఆగం చేస్తూ, మీ కుట్రల కబంద హస్తాలతో మా పిల్లల జీవితాలను చిదిమేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతూ వున్నారు. ఇప్పటికే మా పిల్లలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాల్లో ఆరకొర సౌకర్యాలతో ఆకలి కేకలతో అలమటిస్తూ నాన్యత పరిశుభ్రత లేని ఆహారం తిని ఫుడ్ పాయిజన్ పాము కాట్లతో విష జ్వరాలతో సమీదల్లా రాలిపోతున్నా స్పందించని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిసి విధుల నుండి తొలగించిన వారందరిని కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకొని వారందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ, గురుకులాల్లో 2017 వ సంవత్సరంలో మెను ప్రకారం ఇప్పుడు పెరిగిన ధరల కనుగుణంగా కాస్మోటిక్స్,మెస్ ఛార్జీలు పెంచి పిల్లలకు నాణ్యమైన విద్య వైద్యం పౌష్టికాహారం పరిశుభ్రమైన మౌలిక వసతులు కల్పిస్తూ గురుకులాల్లో చదువుతున్న పిల్లలకు న్యాయం చేయాలని, వెంటనే సెకండ్ హిందీ పోస్ట్ లు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బ్రహ్మ కుమారిస్ సంస్థను వెంటనే తొలగించాలని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల వల్ల గురుకులాలో నష్టం ఎదురవుతుందని ఆయన ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టి జి పి ఏ జిల్లా ప్రధానకార్యదర్శి కె ఎల్ మూర్తి,జిల్లా ఉపాధ్యక్షులు ఉత్తర్ల మహేష్,జిల్లా కోశాధికారి దుర్గం కుమార్,జిల్లా మీడియా ఇంచార్జీ, పెద్దపల్లి ఎట్ సుల్తానాబాద్ బాలుర గురుకుల పాఠశాల కళాశాల వైస్ చైర్మన్ దేవి రాజేందర్,టి జి పి ఏ జిల్లా కార్యవర్గ సభ్యులు కాల్వ కుమార్,పేరెంట్స్ కమిటి మీడియా ఇంచార్జీ లంక దాసరి భాస్కర్,కార్యవర్గ సభ్యులు గుండెటి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# క్రాప్ లోన్ రెన్యువల్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి.....

-రైతుల ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ నందు వ్యక్తి పేరు, చిరునామా మార్పులపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి...

-జిల్లావ్యాప్తంగా ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.....




రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : రుణమాఫీ పొందిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, రేషన్ కార్డు లేని వారి కుటుంబ సభ్యుల వివరాలకు సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో జిల్లాలోని రుణమాఫీ పొందిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్, ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి, రేషన్ కార్డులేని వారి వివరాల సెకరణ పై సంబంధిత వ్యవసాయ, బ్యాంక్, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రుణమాఫీ పొందిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, రుణమాఫీ కానీ రైతుల ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ లలో వ్యక్తి పేరు, చిరునామాల మార్పులపై వెంటనే ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత వ్యవసాయ, బ్యాంక్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించి 2024-25 సంవత్సరానికి నిర్ణయించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని, అధికారులు రైతులు సమన్వయంతో పనిచేయాలని, ప్రస్తుతం ఉన్న ఆయిల్ ఫామ్ పంటసాగు వద్ద రైతులతో సమీక్ష నిర్వహించి, వారికి ప్రత్యక్షంగా సాగు విత్తనాలు, పంటకాలం, సాగు విధానం వివరించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులతో అన్నారు.అనంతరం జిల్లాలోని మండల స్థాయి అధికారులతో రేషన్ కార్డులు లేని వారి కుటుంబ సభ్యుల వివరాలకు సర్వే నిర్వహించి, పూర్తి జాబితాను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎల్.డి.ఎం వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లు వీధి లైట్లు మంచి నీటి సదుపాయాలు కల్పించండి :విద్యుత్ నగర్ వాసులు



రాజవొమ్మంగి, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలంలోని ఎంకె రైస్ మిల్లు సమీపంలో ఉన్న విద్యుత్ నగరంలో సుమారు వంద కుటుంబాలు 40 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నామని త్రాగునీటి వసతులు,సిసి రోడ్లు,వీధి లైట్ల, మంచి నీటి కుళాయిలు లేక చాలా సంవత్సరాల నుండి ఇబ్బందులకు గురి అవుతున్నారని బుధవారం విద్యుత్ నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క చేతి పంపు మాత్రమే ఉందని వర్షాకాలంలో బురద నీరు వస్తుందని, వేసవిలో పంపు నుండి నీరు రాదని, సరైన రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు దీనిపై స్పందించి విద్యుత్ నగర్ వాసులు సమస్యలు పరిష్కరించాలని కోరారు ఈకార్యక్రమంలో ఎం బుల్లమ్మ,కె రత్నం,కళింకోట కృష్ణవేణి,కళింకోట రాజేశ్వరి,యళ్ల అప్పలరాజు,షేక్ మస్తాన్బి,కాయితి నూకరత్నం రాజబాబు తదితరులు ఉన్నారు

# నిందితులకు శిక్ష పడటం లో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనది.... సీపీ ఎం.శ్రీనివాస్

- అన్ని కోర్ట్ లలో వీసీ ద్వారా అండర్ ట్రయల్ ఖైదీలను ప్రవేశపెట్టాలి....

-సీపీ ఎం.శ్రీనివాస్.....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : కోర్టు డ్యూటీ ఆఫీసర్ లు నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడుటకు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిదిలోని పోలీస్ స్టేషన్ లలో పనిచేస్తున్న కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్, కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో కమీషనరేట్ లో సిపి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, డిజిపి ఆధ్వర్యంలో జరిగిన హై లెవెల్ కమిటీ మీటింగ్ తరువాత డిజిపి యొక్క ఆదేశాల మేరకు కోర్ట్ లలో అండర్ ట్రయల్ ఖైదీలని నేరుగా జైలు నుండి పోలీసు ఎస్కార్ట్ ద్వారా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రవేశపెట్టాలని ,కోర్ట్ కానిస్టేబుల్ లకు సూచించడం జరిగింది. దీనివలన పోలీసుల యొక్క పని భారం తగ్గుతుందని దాని ద్వారా సమయం ఆదా అవుతుందని, నేరస్తులు జైలు నుండి కోర్టుకు తీసుకువెళ్లే సమయంలో పారిపోయే అవకాశం కూడా ఉండదని అన్ని కోర్టులలో వీసీ ద్వారానే అండర్ ట్రయల్ ఖైదులను ప్రవేశపెట్టాలని, అదేవిధంగా నేరస్థులకు శిక్ష పడే విధంగా సాక్షలను ప్రవేశపెట్టి



ట్రయల్ సజావుగా జరిగే విధంగా చూడాలని సిపి కోర్టు లైజన్, కోర్టు డ్యూటీ అధికారులకు సూచించడం జరిగింది. నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషిచేయాలని, కన్విక్షన్ రేటును పెంచాలని అన్నారు. కోర్టు నందు ఎఫ్ఐఆర్ లను సరైన సమయంలో అందించాలని, కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టు నందు డిపాజిట్ చేయాలి. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషిచేయాలని, నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధముగా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పబ్లిక్ ప్రాసిక్యూటర్ యొక్క సలహాలు సూచనలు పాటించాలని, కోర్టు పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్స్, సమన్స్, సి.సి.టి.యన్.యస్ లో ( కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్) లో డాటా ఎంటర్ చేయాలని సూచించారు. కోర్టు నందు ట్రయల్ జరిగిన కేసులు ఎంటర్ చేసినచో పెండింగ్ లేకుండా వుంటుందని తెలిపారు. భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, భాదితులకు మరింత నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘువేంద్ర రావు , ఎసిపి ప్రతాప్, సురేంద్ర సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ బుద్దే స్వామి ,ఆర్ ఐ లు దామోదర్, వామన మూర్తి,సంపత్ పెద్దపల్లి,మంచిర్యాల జోన్ ల కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పోలీస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజ్ పెద్దపల్లి లో సైబర్ మోసాలపై చైతన్య పరిచేందుకు అవగాహనసదస్సు.....

## - డిఎస్పీ ఎం .వెంకటరమణ....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : రామగుండం పోలీస్ కమిషనరేట్ లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ ఎం .వెంకటరమణ ఆదేశాల మేరకు పెద్దపెల్లి లోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు మరియు సిబ్బంది కి సైబర్ నేరాలపై, సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ జై కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ, విద్యార్థులపై జరుగుతున్న సైబర్ నేరాలు, సైబర్ క్రైమ్స్ క్రెడిట్ కార్డ్స్ రిలేటెడ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్ ఫ్రేడ్స్ లోన్ యాప్ ల, ఓటీపీ, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్ ల గురించి, సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ఇంపార్టెంట్స్ పై గురించి తెలిపారు. ఆన్లైన్ మోసాలపై అడ్డుకట్ట వేయుటకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడం తో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని, తమ ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, బంధువులకు, చుట్టూ ప్రక్కల వారికి, మీ గ్రామంలలో కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ లేదా ద్వారా ఫిర్యాదు చేయాలని సిబ్బంది కి సూచించారు. అవగాహన కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, ప్రశాంత్, మౌనిక, వెంకటేష్ లు పాల్గొన్నారు.

# మహిళా అనుమానాస్పద మృతి పై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కాకినాడ జిల్లా జగ్గంపేట సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : జగ్గంపేట గ్రామం మరియు జగ్గంపేట మండలానికి చెందిన ముద్దాడ జ్యోతి దుర్గాప్రసాద్ , యాదవ, 29, దేవి సెంటర్ జగ్గంపేట.. ఆమెకు 9 సంవత్సరాల క్రితం బలబద్రపురం గ్రామానికి చెందిన ముద్దాడ దుర్గాప్రసాద్ తో వివాహం జరిగినది. వారికి ఇద్దరు అబ్బాయిలు సంతానము.. వారు గత కొంతకాలంగా జగ్గంపేట గ్రామంలోనే ఉంటున్నారు. 4.09. 2024 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో జ్యోతి తన ఇంటిలో తన భర్త దుర్గాప్రసాద్ తో గొడవపడి నట్లు తెలిసినది. తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు తమ ఇంట్లో హాల్లో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకు చనిపోయినదని మంచం మీద పడుకోబెట్టి తన భర్త వచ్చి రక్త బంధువులకు తెలియజేయగా వెళ్లి చూసేసరికి మంచం మీద పడుకుని చనిపోయి ఉన్నది దీనిపై అనుమానాస్పద మరణముగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేయుచున్నారు..

# వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: ఏస్ఐ



వేటపాలెం, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని విగ్రహాలు ఏర్పాటు చేసేవాళ్లు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సింగిల్ విండో అప్లికేషన్ ద్వారా అనుమతులు తీసుకొని మండపాలు ఏర్పాటు చేసుకోవాలని వేటపాలెం ఏస్ఐ ఎం వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటు చేయరాదని అలాగే నిమజ్జనం ప్రదేశం విగ్రహం ఎత్తు నిమజ్జనానికి వెళ్లే మార్గమును ముందే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విగ్రహ కమిటీల సభ్యులు జాగ్రత్త పడాలని తెలిపారు. పోలీసు నిబంధన ప్రకారం అనుమతి ఇచ్చిన క్యూఆర్ కోడ్ పత్రాన్ని మందిరం ఆవరణలో అతికించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# ఎల్లమ్మ బోనం ఎత్తిన రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి రాజ్ ఠాకూర్....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : బుదవారం ఎల్కలపల్లి గ్రామం లోని ఎల్లమ్మ బోనాల కార్యక్రమం లో పాల్గొని బోనం ఎత్తి అమ్మ వారికి బోనం సమర్పించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ, అమ్మవారి దయవలన మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు సహకారం తో 1800 పవర్ ప్లాంట్ సాదించుకోవడం జరిగింది, అలాగే అ అమ్మవారి దయవలన ఈ వర్ష కాలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అ అమ్మవారి దయ ఉండాలని ప్రార్ధించడం జరిగిందన్నారు. అలాగే ఈ గ్రామం లో ఎదైనా సమస్య ఉంటే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ద్రుష్టికి తీసుకు రావాలని కోరడం జరిగింది.

# పేకాట శిబిరం పోలీసులు దాడి..



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లీశాల గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు ఎస్ఐ రఘునాథరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాట రాయులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 7 వేల 50 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు..

# రాజవొమ్మంగి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గణేష్ మట్టి విగ్రహాలు పంపిణీ



రాజవొమ్మంగి, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలం స్థానిక 99 బిల్డింగ్స్ లో బుధవారం గణేష్ యూత్ నిర్మించిన వినాయక మండపంలో సుమారు 200 మట్టి వినాయక విగ్రహాలను స్థానిక ప్రజలకు భాజపా రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు భారతి,మండల అధ్యక్షుడు తాము సూరిబాబు,హైందవ సైన్యం మెంబర్ డీవీకే ప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తెదేపా పంచాయితీ సర్పంచ్ గొల్లపూడి రమణి,జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రజలు అందరూ ఉత్సాహంగా వినాయక చవితి సంబరాల జరుపుకోవాలని కోరుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు అదేవిధంగా జెడ్డంగి గ్రామంలో 100 మట్టి విగ్రహాలు స్థానిక గ్రామస్తులకు అందజేసామని భాజపా మండల అధ్యక్షుడు తాము సూరిబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మెంబర్ బీవీఎస్ఎన్ గుప్తా,శ్రీను,కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వల్ల నష్టపోతున్న లింగాపూర్ ఎస్సీ కాలనీ....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఇటీవల ప్రతిరోజు కురుస్తున్న వర్షాలకు సింగరేణి ఓబి కుప్ప నుండి వస్తున్న వరదలకు నానిపోయిన ఇల్లు గోడలు కూలిపోతున్నాయి.బుదవారం ఉదయం మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి ఇరికిల్ల పద్మ - శంకరయ్య ఇల్లు వరద ముప్పుతో కూలిపోయింది. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని మాజీ సర్పంచ్ శంకరయ్య తెలిపారు.ఇప్పటికైనా సింగరేణి ఎస్సి కాలినిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని వారు కోరారు..

# ఎల్లంపల్లి ప్రాజెక్టును టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.....

## -రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఎన్నడూ లేని విధంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును, రామగుండం రాముని గుండాలను టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని అన్నారు.పెద్దపెల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు ను సందర్శించిన రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, రామగుండం నియోజకవర్గం లో ఎన్నో పర్యాటక ప్రదేశాలుగా ఉన్నాయని దానిలో భాగంగానే మన ఎల్లంపల్లి ప్రాజెక్టును టూరిస్ట్ ప్రాంతంగా చేయడానికి ప్రభుత్వం నుండి అనుమతి తీసుకొని, ఈ ప్రాజెక్టు ప్రాంతాన్ని టూరిస్ట్ ప్రాంతంగా తప్పకుండా తీర్చిదిద్దుతామని దానికి సంబంధించి ప్రాజెక్ట్ ప్రదేశాన్ని పరిశీలించి, అక్కడ ఉన్నటువంటి ప్రాజెక్టు ఏ ఈ డి సంబంధిత ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారిని వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని, ఈ ప్రాంతాన్ని త్వరలోనే పర్యాటక కేంద్రంగా చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల రెవెన్యూ డిప్యూటీ తాసిల్దార్ సతీష్ రావు, అంతర్గాం మండల ప్రజా పరిషత్ గ్రామపంచాయతీ అధికారి బైరివేణుమాధవ్, రెవెన్యూ పరిశీలక అధికారులు శ్రీధర్, శ్రీమన్, ప్రాజెక్ట్ ఏ ఈ ,డి ఈ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెండు హనుమాన్ రెడ్డి, మురుమూరు తాజా మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కర్ రమేష్ యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, మాజీ ఎంపిటిసి బొద్దు లింగమూర్తి ,అంతర్గాం మండల అధికార ప్రతినిధి మడ్డి తిరుపతి గౌడ్, అంతర్గాం మైనార్టీ సెల్లు అధ్యక్షులు అబ్దుల్ మెహరాజ్ ఉద్దీన్ ఓబీసీ బీసీ సెల్ అధ్యక్షులు పెండ్యాల మహేష్, అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత ప్రభుత్వా అధికారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా వరదనీరుతో ఇండ్లు మునిగిపోవడంతో సమస్య పరిష్కారం చేయించిన మండల ప్రజా పరిషత్ అధికారి అబ్దుల్ అలీమ్.....



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : పెద్దపెల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని మసీదు వాడ గల్లీలో గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు ఇండ్లలోకి చేరి , మునగడం జరుగుతుందని తెలుసుకున్న స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారి అలీమ్, మండల మండల పంచాయతీ ప్రత్యేక అధికారి బైరి వేణుమాధవ్, అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భోగె వెంకట్, అక్కడికి చేరుకొని స్థానిక పరిస్థితులను తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఆ పరిస్థితిని వివిధ యంత్రాల ద్వారా సర్దుమనువు చేయడానికి ప్రయత్నాలు చేయడం జరిగిందని, మండల ప్రజాపరిషత్ అధికారి అబ్దుల్ అలీమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల ప్రజా పరిషత్ అధికారి అబ్దుల్ అలీమ్ ,మండల పంచాయతీ అధికారి బైరి వేణుమాధవ్, అంతర్గం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోగె వెంకట్, పంచాయతీ కార్యదర్శి అంకం రవి, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడుపై ఫోక్సో చట్టంపై కేసు నమోదు.

మొగల్తూరు, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడుపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముత్యాలపల్లికి చెందిన 16 సంవ త్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన కొపనాతి నర్సింహస్వామి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడ న్నారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈకేసును నరసాపురం డిఎస్పీ మురళీకృష్ణ బుధవారం విచారణ చేశారు.

## సచివాయ ఉద్యోగిపై దాడి.

మొగల్తూరు, సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధి 1వ గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కొల్లు దుర్గాప్రసాద్ బుధవారం నలుగురు వ్యక్తులు దాడిచేశారు. మొగల్తూరు జాతీయ రహదారి వైజంక్షన్ నుండి బైక్పై వస్తున్న దుర్గా ప్రసాద్ను కడలివారిపాలెంకు చెందిన నలుగురు యువ కులు దారి కాచి బైక్ రోడ్డుపై పెట్టి హెల్మెట్తో కొట్టారు. దీనిపై బాదితుడు దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మేడిపల్లి గ్రామానికి కమ్యూనిటీ హాల్ స్థల పరిశీలనకు వచ్చిన సింగరేణి అధికారులు...



రామగుండం సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : బుదవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు మేడిపల్లి గ్రామానికి సింగరేణి సివిల్ సూపర్డెంట్ , ఓసిపి ఫోర్ ప్రాజెక్ట్ మేనేజర్ మల్లికార్జున్, సింగరేణి ఉన్నత అధికారులు కమ్యూనిటీ హాల్ స్థల పరిశీలనకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీ మూడో డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేష్ గ్రామ పెద్దలను కలిసి స్థల పరిశీలన చేయడం జరిగింది. అలాగే గ్రామానికి కావలసిన సదుపాయాలు కూడా త్వరలో మీ ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ద్వారా మీ గ్రామానికి సమకూరుస్తారని ,సింగరేణి అధికారులు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని, దానికి గాను మా పేద ప్రజల ఆశాజ్యోతి ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ కి ,అలాగే సింగరేణి అధికారుల సహకరించిన అందరికీ, ఆర్జీ వన్ జీఎం కి మేడిపల్లి గ్రామ ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ 3వ. డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్ఎంపి వైద్యానికి నిండు ప్రాణం బలి



ఆమదాలవలస సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : ఆమదాలవలస మండలంపట్టణం పరిధిలో పిఎంపిల ఆగడాలకు హద్దులు లేకుండా పోయాయి.గ్రామీణ ప్రాంతాలలో పిఎంపిలు హద్దు మీరి వైద్యం చేస్తుండటంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.ప్రజల ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. వివరాల్లోకి వెళితే ఆరోగ్యం బాగోలేదంటూ ఓ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ వద్దకు ఆమదాల వలస పట్ట ణనికి చెందిన గణపతి రావు(32) వైద్యం సేవలకు వెళ్ళగా వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి చెందాడు. తల్లి ద్రౌపది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేష్ పోలీసు స్టేషన్ లో పిఎంపి వైద్యుడు బగాన. బాబురావు పై కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం మందస కు చెందిన గణపతి రావు మైత్రి పోలీస్ గా రాత్రి సమయాల్లో బంగారం షాపుల దగ్గర కాపలా కొనసాగుతున్నారు. సోమవారం సాయంత్రం ఒంట్లో బాగోలేదని పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న సంచి వైద్యుడు బగాన. బాబురావు దగ్గరికి వైద్య సేవ కోసం వెళ్ళాడు. మైత్రి పోలీస్ గణపతికి ఐ వి( నరం ) ఇంజక్షన్ ఇవ్వడంతో డోస్ ఎక్కువై గణపతి స్పృహ తప్పి పడిపోయాడు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ దగ్గర చూపించగా మా వాళ్ల కాదని శ్రీకాకుళం తీసుకువెళ్లాలని వైద్యులు చెప్పడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇంజక్షన్ డోస్ ఎక్కువ కావడంతో మైత్రి పోలీస్ గణపతి మృతి చెందాడని తల్లి ద్రౌపది ఇచ్చినటువంటి ఫిర్యాదు మేరకు సంచి వైద్యుడు బాబురావు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమదాలవలస మండలంలో కొన్ని మెడికల్ స్టోర్ లో కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నట్లు గత కొంతకాలంగా ఫిర్యాదులు ఉన్నప్పటికీ డ్రగ్ ఇన్స్పెక్టర్ తూతూ మంత్రంగా పరిశీలనలు చేస్తున్నారని ఆమదాలవలస పట్టణం ప్రజలు వాపోతున్నారు.

## సంఘాలు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మెలగాలి

### ఎం.ఎం.ఎస్. అధ్యక్షురాలు.. ధనలక్ష్మి



ఆమదాలవలస. సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : మహిళా సంఘాలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మెలగాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి కోరారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయం పాలకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలన్న ఆశయముతో ప్రభుత్వం ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ పేరుతో సంఘాలలో గల మహిళలకు వ్యక్తిగతంగా అందిస్తున్న రుణాలను సద్వినియోగపరుచుకొని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి సంఘం తమ పొదుపు నిల్వలను ఇంటర్నల్ లెండింగ్ చేసుకొని తరువాత మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం గ్రామ సంఘాల ద్వారా శ్రీనిధి రుణాలు వినియోగించుకోవాలన్నారు. ఏ.పి.ఎం. పైడి కూర్మా రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వినియోగించుకొని ప్రతి మహిళ తమ పిల్లలను చదివించుకోవడంతోపాటు , కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరుచుకునే ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ప్రతినిధులు వేణమ్మ ,రేణుక, అకౌంటెంట్ రోజా తోపాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## పరామర్శలు చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన టిడిపి పార్టీ కార్యకర్తలు సానుభూతిపరులైన వారి కుటుంబ సభ్యుల్ని ఈరోజు ఆముదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ పరామర్శించారు. వారి మృతి పట్ల సానుభూతి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మీ కుటుంబాలకు టిడిపి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు, అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు

## గురువును గౌరవిద్దాం..

## ఊరిబడిని కాపాడుకుందాం... : పేడాడ రామ్మోహన్

### భారత మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ గారి జన్మదినం సందర్భంగా



సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : రేపు అనగా సెప్టెంబర్ 5 2024 నాడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయుల సేవలను కొనియాడే విధంగా జనసేన పార్టీ శ్రేణులు అందరూ కూడా వారి వారి గ్రామాలలో పాఠశాలలను సందర్శించి సంబంధిత ఉపాధ్యాయులకు పుష్పాలు పండ్లు మొదలగునవి అందజేస్తూ గురు వందనంపేరుతో కార్యక్రమం నిర్వహించి గౌరవించాలని కోరారు.

## ఉద్యానవన పంట పొలాలు పరిశీలన.



పొన్నూరు సెప్టెంబర్ 04 జనం రిపోర్టర్ : గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో గుంటూరు ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు స్థానిక ఉద్యానవన శాఖ అధికారిణి ఉషా తో కలిసి పొలాలను పరిశీలించారు. గుంటూరు ధ్యానమున శాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ తమలపాకు తోటల్లో వరుస క్రమంలో అవిసెలు పల్చగా వేసుకుంటే వర్క్ షాప్ నీరు పడిన వెంటనే ఆవిరైపోయి తోట ఎదుగుదల ఉండి అధిక దిగుబడును పొందవచ్చునని పేర్కొన్నారు. తమలపాకు తోటల్లో ముదురు తీగలను తుంచివేసి ఒక శాతం బోర్డ మిశ్రమం పిచికారి చేసి వెయ్యాలన్నారు. అధిక దిగుబడులు పొందేందుకు పలు సూచనలు సలహాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రాల్లో మహిళలపై దారుణాల నేరాల సంగతి ఏమిటి?

### సామూహిక అత్యాచారం కేసుల్లోనూ మరణ శిక్ష విధించాలంటున్న బెంగాల్ బిల్లు

### మహిళా రక్షణ చట్టాలను సమర్థంగా అమలు చేయలేని అగ్ర నేతలు రాజీనామా చేయాలని డిమాండ్



కోల్కతా: కోల్కతా ఆర్జి కర్ ఆసుపత్రిలో 31 ఏళ్ల డాక్టర్పై హత్యాచారం ఘటనపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బెంగాల్కు సంబంధించినంత వరకు క్రిమినల్ కోడ్, భారతీయ న్యాయ సంహితలోని కొన్ని నిబంధనలను సవరించేందుకు 'అపరాజిత' బిల్లును పశ్చి మ బెంగాల్ శాసనసభ మంగళవారం ఆమోదించింది. అత్యాచారం, బాలలపై వేధింపులకు శిక్షలను ఆ సవరణలు మరింత కఠినాత్మకం చేస్తాయి. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యా య సంహిత (బిఎన్ఎస్)లో పలు సెక్షన్లను సవరించడం ఆ బిల్లు లక్ష్యం. బిఎన్ఎస్లోని సెక్షన్ 64 ప్రకారం, అత్యాచార నేరానికి నిర్ధారిత దోషి కి పదేళ్లకు తక్కువ కాకుండా కఠిన కారాగార శిక్ష విధిస్తారు. దానిని యావజ్జీవ కారాగార శిక్షగా పొడిగించవచ్చు. బెంగాల్ చట్టం దానిని మారుస్తున్నది. జైలు శిక్షను 'ఆ వ్యక్తి జీవితాంతం వర కు కొనసాగుతుంది, జరిమానా కూడా పడుతుం ది. లేదా మరణశిక్ష విధించవచ్చు'. బాధితురాలి వైద్య ఖర్చులు, పునరావాస ఖర్చులు భరించగలిగే విధంగా ఆ జరిమానా ఉంటుంది. అత్యాచా రం బాధితురాలి మరణానికి లేదా 'కోమా దశకు' దారి తీసినట్లయితే నిర్ధారిత దోషికి జరిమానా విధిస్తున్న బిఎన్ఎస్ సెక్షన్ 66ను సవరించాలని అపరాజిత బిల్లు కోరుతున్నది, అటువంటి నేరానికి 20ఏళ్ల జైలు శిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, మరణ శిక్ష విధించాలని కేంద్ర చట్టం నిర్దేశిస్తుండగా బెంగాల్ బిల్లు సదరు దోషికి మరణ శిక్ష మాత్రమే విధించాలని సూచిస్తోంది. సామూహిక అత్యాచారం కేసులకు సంబంధించిన బిఎన్ఎస్ సెక్షన్ 70ని సవరిస్తున్న బెంగాల్ చట్టం 20 ఏళ్ల జైలు శిక్ష ఆప్షన్కు స్వస్తి పలికి, కారాగార శిక్ష, మరణ శిక్షను నిర్దేశిస్తున్నది. తృణమూ ల్ కాంగ్రెస్ (టిఎంసి) ఆ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. 'అపరాజిత'చట్టం అని పేర్కొనే 'చరిత్రాత్మక' చ ట్టం దర్యాప్తులను వేగవంతం చేస్తుందని, కఠిన శి క్షలు విధించేలా చేస్తుందని ఆమె తెలిపారు. కోల్కతా కర్ ఆసుపత్రి డాక్టర్పై హత్యాచారం ఘటనపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్న మమతా బెనర్జీ మంగళవారం త మ పోలీస్ బలగాన్ని గట్టిగా సమర్థించారు. ఇతర రాష్ట్రాల్లో మహిళలపై దారుణ నేరాల సంగతి ఏ మిటని మమత ప్రశ్నించారు. 2020లో ఉత్తర ప్ర దేశ్ హథ్రాస్లో 20 ఏళ్ల దళిత మహిళపై అత్యాచారం, 2013లో బెంగాల్ ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఒక కళాశాల విద్యార్థిని హత్యాచారం, క్రితం వారం రాజస్థాన్ రాజధాని జైపూర్లో ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలిక అత్యాచారం ఘటనలను మమత ప్రస్తావించారు. 'కాందుని కేసు (ఉత్తర 24 పరగణాల జిల్లాలో అత్యాచారం)లో మేం మరణ శిక్ష కోరాం.. కానీ ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్లో ఉంది (కలకత్తా హైకోర్టు ఒక నిందితుని నిర్దోషిగా విడుదల చేసి, మరి ఇద్ద రి మరణ శిక్షను జైలు శిక్షగా మార్చడంపై అప్పీ ల్ దాఖలైంది). ఉన్నావ్లో ఏమి జరిగిందో ఎవ రూ మాట్లాడడం లేదు, హథ్రాస్ బాధితురాలికి న్యాయం జరగలేదు' అని ఆమె చెప్పారు.

### మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి

'యుపి, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బాగా ఎక్కువ గా నేరాల రేట్లు ఉన్నాయి. అక్కడ న్యాయం జరగలేదు కానీ బెంగాల్లో మహిళలకు కోర్టుల్లో న్యా యం జరుగుతుంది' మమత అసెంబ్లీలో కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. 'మహిళల పరిరక్షణకు సమర్థమైన చట్టాలను అమలు చేయలేకపోతున్న' అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధా ని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమి త్ షా రాజీనామా చేయాలని కూడా ఆమె కోరా రు. మోడీ, అమిత్ షా మమత ప్రస్తావించడం బిజెపి శాసనసభ్యుల నుంచి పెద్ద పెట్టున నిరసనలకు దారి తీసింది. 'మీరు నాపై నినాదా లు చేయగా లేనిది ప్రధాని, హోమ్ శాఖ మంత్రి పై నేను నినాదాలు చేస్తే ఏమవుతుంది' అని మ మత ప్రశ్నించారు. కాగా, ఉత్తర 24 పరగణాల జిల్లాలో అత్యాచారానికి, హత్యకు గురైన యువతికి నివాళిగా కొత్త చట్టానికి ఆ పేరు పెట్టారని పలువురు భావిస్తున్నారు. కొన్ని వార్తల ప్రకారం ఆమె పేరు అపరాజిత. కేంద్రం ఆమోదించిన చ ట్టాల్లోని 'లోటుపాట్లను' అపరాజిత చట్టం 'పరిహరిస్తుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు.

# విరాళాల్లో పోటాపోటీ!

- –ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు
- –100 కోట్లు ప్రకటించిన తెలంగాణ ఉద్యోగుల
- –జేఏసీ చైర్మన్.. 130 కోట్లు ఇస్తామన్న ఐకాస చైర్మన్
- –పింఛనుదారుల ఐకాస రూ.33 కోట్ల విరాళం



హైదరాబాద్, మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు ఇవ్వడంలో ఉద్యోగ సంఘాల నాయకులు పోటీ పడ్డారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరఫున ఆ సంఘం చైర్మన్ వి.లచ్చిరెడ్డి మంగళవారం ఉదయం వరద బాధితుల సహాయార్థం రూ.100 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, దీనికి ఉద్యోగుల తరఫున చేయూతగా ఒక రోజు మూలవేతనం రూ.100 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల తరఫున సమష్టి నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి అంగీకార పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మారం జగదీశ్వర్ నేతృత్వంలోని ఉద్యోగుల ఐకాస స్టీరింగ్ సమావేశం నిర్వహించింది. సీఎం సహాయ నిధికి ఉద్యోగుల ఒక రోజు మూల వేతనం రూ.130 కోట్లు అందజేస్తున్నట్లు ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్రెడ్డి ఇతర సంఘాల నాయకులు తీర్మానం చేశారు. అనంతరం ఐకాస నాయకులు మహబూబాబాద్లో పర్యటిస్తున్న సీఎం రేవంత్రెడ్డిని కలిసి లేఖను అందజేశారు. సంఘాల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులపై మాట్లాడని నాయకులు.. ఎవరికి తోచినట్లు వారు ఒక రోజు మూలవేతనంపై ప్రకటనలు చేస్తున్నారన్న విమర్శలు వినిపించాయి. రెండు సంఘాల నాయకులు ఎవరికి తోచినట్లు వారు నిర్ణయాలు తీసుకోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఉద్యోగులు వాపోతున్నారు.

### పింఛనుదారుల ఐకాస రూ.33 కోట్ల విరాళం

తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. వరదల వల్ల నష్టపోయిన వారి సహాయార్థం పింఛనుదారుల ఒక రోజు మూల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.80 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని, వారి ఒక రోజు మూలవేతనం రూ.33 కోట్ల ఉంటుందని, సెప్టెంబరు నెల పింఛను నుంచి మినహాయించాలని సీఎస్ శాంతికుమారిని కోరినట్లు లక్ష్మయ్య తెలిపారు.

# ఖమ్మంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ

- –వరద బాధితుల పరామర్శ సందర్భంగా
- –ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం
- –పువ్వాడ, జగదీశ్ కార్ల అద్దాలు ధ్వంసం
- –ఒక బీఆర్ఎస్ కార్యకర్తకు గాయాలు



ఖమ్మం, సెప్టెంబరు 3 /ఖమ్మం క్రైం: ఖమ్మంలో మున్నేరు వరద బాధితుల పరామర్శలో రాజకీయ వివాదం రాజుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి పలువురు స్వల్పంగా గాయపడ్డారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్కుమార్, జగదీశ్ రెడ్డి కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. సీఎం రేవంత్ మంగళవారం జిల్లాలో పర్యటన ముగించుకుని వెళ్లగానే బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్రెడ్డి, వివేక్గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్రాజు తదితరులు వరద బాధితుల పరామర్శకు ఖమ్మం చేరుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్పలో వరద బాధితులను పరామర్శించారు. అనంతరం నగరంలోని బొక్కలగడ్డ, మంచికంటి నగర్ వరద బాధితులను పరామర్శించి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తున్నా బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు స్పందిస్తూ వరద బాధితులకు సహాయం అందడం లేదని ఆరోపించారు. దాంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు హరీశ్రావు, జగదీశ్రెడ్డి, పువ్వాడ కార్లపై రాళ్లు విసిరారు. రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. సంతోష్ రెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్తకు గాయాలయ్యాయి. కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు మాజీ మంత్రులు ఉన్న కార్లకు రాళ్లు తగలగకుండా వాటిని పక్కకు పంపిస్తుండగా కారు కింద పడి ఓ కార్యకర్త కాలు విరిగింది. ఇరు వర్గాల తోపులాటలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు మాజీ మంత్రుల కార్లను అక్కడి నుంచి పంపించారు. ఇరు వర్గాలను వారించడంతో గొడవ సద్దుమణిగింది. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారంటూ ఈ ఘటనపై ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

# శాంతించిన కృష్ణమ్మ



హైదరాబాద్, సెప్టెంబరు 3 : ఉగ్రరూపం చూపిన కృష్ణమ్మ శాంతిస్తోంది. రెండు రోజుల పాటు ఉధృతంగా ప్రవహించి మంగళవారం ఉధృతి తగ్గించింది. దీంతో మంగళవారం ఆలమట్టి జలాశయం గేట్లును మూసివేశారు. ఇన్ఫ్లో 60 వేల క్యూసెక్కులు ఉండగా విద్యుదుత్పత్తి ద్వారా 28 వేల క్యూసెక్కులను నారాయణపూర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. 20 వేల క్యూసెక్కుల నీరు చేరుతున్న నారాయణపూర్ నుంచి 8,296 క్యూసెక్కులను జూరాలకు వదులుతున్నారు. జూరాలకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదవుతోంది. 27 గేట్ల ద్వారా 2.07 లక్షల క్యూసెక్కులను విడుస్తున్నారు. శ్రీశైలానికి 4.77 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో ఉండగా 10 గేట్ల ద్వారా 3.56 లక్షల క్యూసెక్కులు నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు. సాగర్కు 3,37,687 క్యూసెక్కులు వస్తుండగా.. 26 గేట్ల నుంచి 3.16 లక్షల క్యూసెక్కులను దిగువకు పంపుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం పడుతోంది. మంగళవారం రాత్రి 10 గంటలకు 6,61,335 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. మొత్తం 70 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, గేటు మరమ్మతు అనంతరం తుంగభద్ర జలాశయం మళ్లీ నిండనుంది. బుధవారం పూర్తి నీటి మట్టానికి చేరనుంది. 30 వేల క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తుండగా 15,441 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు.శ్రీరాంసాగర్కు వరద కొనసాగుతోంది. మంగళవారం 2.45 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. రెండో రోజూ 41 గేట్లను ఎత్తి ఉంచారు. 2.83 లక్షల క్యూసెక్కులను కిందకు వదిలారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 34,600

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, # /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15,NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.).
Cell:9398156948,REG.RNI:APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com